'దార్ల మాట' శతకం



డా॥ దార్ల వెంకటేశ్వరరావు

అంకితం



గణేష్ దినపత్రిక సంపాదకులు శ్రీ కొత్తూరు సత్యనారాయణగుప్తగారు ఆ పత్రిక ద్వారా ఎంతోమంది కవులను ప్రోత్సహిస్తున్నారు. ప్రతిదినం ఒక పేజీనంతా కేవలం కవితలకే కేటాయించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆదివారం ఏకంగా రెండు పేజీల నిండా కవిత్వాన్నే ప్రచురిస్తున్నారు. కేవలం కవితను ప్రచురించడమే కాకుండా, కవిత రాసిన వారి ఫోటోని, భావయుక్తమైన ఫోటోల్ని కూడా ప్రచురిస్తుంటారు. వర్ధమాన కవుల్ని నిత్యం ప్రోత్సహించే సంపాదకులు సత్యనారాయణగుప్త గారు నిజంగా సాహిత్యానికి ఎంతో సేవ చేస్తున్నారనిపించింది. వారానికి ఒక అంశాన్నిచ్చి దానిపై కవిత్వం రాయమనడం వల్ల వర్ధమాన కవుల్లో కవిత్వం రాసే ఉత్సాహాన్ని నింపడంతో పాటు, ఒరిజినల్‌గా కవిత్వం రాసేవాళ్ళే నిబడతారని నిరూపించే ప్రయత్నం చేస్తుంటారు. ఆయన చేసే నిస్వార్థమైన సాహిత్య కృషి నన్ను బాగా ఆకర్షించింది.

అందుకే ఈ శతకాన్ని ఆయనకు హృదయపూర్వకంగా అంకితం చేస్తున్నాను.

దార్ల వెంకటేశ్వరరావు

'దార్ల మాట' శతకం

దార్ల వెంకటేశ్వరరావు

మంజుశ్రీ ప్రచురణలు
హైదరాబాదు
2021

'DARLA MATA' SATAKAM

by

DARLA VENKATESWARA RAO
Professor & Head, Department of Telugu,

School of Humanities,
University of Hyderabad, Hyderabad,
Telangana, India

First Edition	:	June, 2021

Copies	:	500
Price	:	₹ 50

BOOKS AVAILABLE AT :

Visalaandhra, Navodaya,
Prajasakti Book House, Hyderabad
and Leading Book Stalls
https://archive.org
www.vrdarla.blogspot.com

ISBN: 978-81-908963-8-2

FOR COMMUNICATION:

B 202, Sai Cluster Apartment,
Sivajinagar Colony,
Near Lingampally Railway Station,
Opp: Bharat Petrol Bunk, Seri Lingampally,
Hyderabad -500 019.
Ph: 9182685231,
E mail: darlahcu@gmail.com

PUBLISHED BY:

Manjusree Publications
Hyderabad

D.T.P	:	Kandi Shankaraiah	Ph:	(7569822984)
Cover Design	:	Vittubabu	Ph:	(8555082034)
Printed at	:	Sai Tirumala Printers,	Hyderabad	

పూలు పరచిన 'దార్ల'లో...

ఈమధ్య కాలంలో ఒక మంచి పరిణామం అనుభవంలోకి వస్తున్నది. పద్యాన్ని వ్రాయడానికి, పద్య కవిత్వాన్ని చదవడానికి ఆసక్తి చూపుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. వారిలో అన్ని రంగాలకు చెందినవారూ ఉంటున్నారు. ఒకప్పుడు వేరు వేరు ప్రక్రియలలో కవిత్వం వ్రాసేవారు పద్యాన్ని చులకనగా చూసేవారు. కాని ఇప్పుడు వారు కూడా "మేమూ ఛందోబద్ధ కవిత్వం వ్రాయగలం" అని నిరూపించుకొనడానికి పద్యాలను వ్రాస్తున్నారు. పద్యానికి ఇటీవల ఇంతటి ప్రాచుర్యం లభించడానికి అంతర్జాలమే మూలకారణమనక తప్పదు. బ్లాగులు, ఫేసుబుక్కు, వాట్సప్ తదితర సమూహాలలో ఎందరో పుంఖానుపుంఖాలుగా పద్యాలు వ్రాస్తున్నారు.

డా॥ దార్ల వెంటేశ్వర రావు గారు నాకు అంతర్జాలం ద్వారా ముందుగా పరిచయమయ్యారు. వారిని మొదటిసారి వ్యక్తిగతంగా చందానగర్ ఉగాది కవిసమ్మేళనంలో కలిసాను. వారు నాకొక మహోపకారం చేసారు... ఈనాడు వారి 'తెలుగు వెలుగు' మాసపత్రిక (మే – 2017) లో "పద్య పాఠశాల" పేరుతో నామీద సమగ్ర వ్యాసాన్ని ప్రకటించి నాకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చారు. అందుకు వారికి సర్వదా కృతజ్ఞుడనై ఉంటాను.

వారు అడపా దడపా 'శంకరాభరణం'లో సమస్యా పూరణలు చేసారు. ఇప్పుడు తాము రచించిన 'దార్ల మాట' శతకాన్ని ప్రచురిస్తున్నారు. ఇందులోని పద్యాలు సరళమైన భాషలో, సమకాలీన అంశాలపై వ్యంగ్యాత్మకమైన భావాలతో, పండిత పామరులను రంజింపజేసేవిగా ఉన్నాయి. విశ్వవిద్యాలయ ఆచార్యులుగా తమ అనుభూతులతో సంస్కారపు పూలు పరచి ఆ 'దార్ల'లో నడవమని దిశానిర్దేశం చేస్తున్నారు దార్ల వారు.

ఈ పుస్తకాన్ని పరిష్కరించే అవకాశాన్ని వారు నాకిచ్చినందుకు సంతోషం. వారి కలంనుండి మరిన్ని రచనలు వెలువడాలని ఆశిస్తూ...

పద భావ సమన్వయంబుల
నెద మీటెడి యాటవెలఁదు లిచ్చోఁ గంటిన్
ముదమిచ్చు 'దార్ల మాట'ల
కిదె మెచ్చితి దార్ల వెంకటేశ్వర రావున్.

కంది శంకరయ్య

'శంకరాభరణం' బ్లాగు, వాట్సప్ సమూహాల నిర్వాహకుడు

వరంగల్.

స్వాగతం

ఎన్నో వినూత్న ప్రక్రియలతో అలరారుతున్న తెలుగు సాహిత్యంలో శతక ప్రక్రియ జోరు నేటికీ కొనసాగుతుందంటే ఆశ్చర్యపడనక్కరలేదు. పద్యానికున్న శక్తి అటువంటిది. దానిలోనూ శతకానికి మరింత శక్తి ఉంది. అందువల్లనే శతక ప్రక్రియ ప్రారంభించిన నాటి నుండి నేటి వరకు ఎంతోమంది ప్రముఖ పద్యకవులు ఇతర ఖండకావ్యాలతో పాటు శతకాలను రాసి సాహిత్యలోకానికి అందిస్తూనే ఉన్నారు. నడుస్తున్న కాలంలో అస్తిత్వ పోరాటాలతోను, వివిధ సాహిత్యోద్యమాలతోను పోటీ పడుతున్న కవులు సరళమైన పదాలతో సమకాలీన సమస్యలపై స్పందిస్తూ చక్కని, చిక్కని పద్యాలు రాస్తున్నారు. అందువల్ల నేటికీ తెలుగు సాహిత్యంలో నిత్యం శతక ప్రక్రియకు ప్రత్యేకస్థానం ఉంది.

శతకపద్యాలు వేటికవే ముక్తకాలుగా పిలువబడతాయి. సాధారణంగా ఒక పద్యానికి మరొక పద్యానికి సంబంధం ఉండదు. ఏ పద్యానికి ఆ పద్యమే తన పత్యేకతను చాటుకుంటుంది. మూడు పాదాలైన తర్వాత, అంటే చివర అందమైన మకుటంతో ఆ పద్యం ముగుస్తుంది. దానివల్ల శతకంలో కథలేని లోటు ఒక్క పద్యం వల్ల కూడా భర్తీ అయిపోతుంది. కొంతమంది కవుల శతకంలో కూడా కొన్ని అంశాల్ని కొనసాగిస్తూ పద్యాల్ని వర్ణించినవాళ్ళున్నారు. శివతత్త్వసారం, భక్తి శతకాలు అటువంటి వాటికి ఉదాహరణలు. వీటిలో భిన్నరూపాల్లో భక్తి భావాన్ని వర్ణించడం కనిపిస్తుంది.

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు "దారి పూలతోట దార్ల మాట" అనే శతకాన్ని తీసుకొచ్చి ముందుమాట రాయమని కోరడం వల్ల, ఈ పుస్తకాన్ని ఆసాంతం చదివాను. బాగా రాశాడు. సమకాలీన సమాజంలో కనిపిస్తున్న వివిధాంశాను సరళమైన పదాలతో పద్యాల్లో శతకగుచ్ఛంగా సాహిత్యలోకానికి అందిస్తున్నందుకు దార్లను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఈ శతకంలోని పద్యాలు అర్థవంతంగా ఉన్నాయనిపించింది. తనకు అనుభవంలోకి వచ్చిన అనేక అనేక అంశాలపైనా, తాను సమాజంలో గమనించిన వివిధాంశాలపైనా స్పందించి, చిన్న చిన్న పద్యాలుగా అందించాడు. చిన్న చిన్న అనారోగ్యాలతో, డయాబెటీస్ సమస్యతో బాధపడేవారి అంతరంగం ఏవిధంగా ఉంటుందో కూడా ఇందులో పద్య రూపంలో చొప్పించడం విశేషం.

"అడగకుండ నిత్తు రందరు సలహాలు
శాస్త్రవేత్తలేరి శాశ్వతముగ

మట్టుబెట్టుటకును మధుమేహజాడ్యంబు
దారి పూలతోట దార్ల మాట"

తనువునిచ్చి, పెంచి, పెద్ద చేసిన మాతృమూర్తిని ఏ కవిగానీ, ఏ మనిషిగానీ మర్చిపోకూడదని నా అభిప్రాయం. అదే విధంగా దార్ల కూడా తన తల్లిని గురించి ఓ పద్యంలో ఇలా అంటాడు.

"వేసవి సెలవులకు వెళ్ళితి నూరికి
ఉక్కబోసి చంపె ఊరునందు
అన్ని మరచిపోతి అమ్మను చూడగా
దారి పూలతోట దార్ల మాట"

మనిషి ఆకాశమంత ఎత్తు ఎదిగినా, అంతరిక్షంలో కాలుమోపి ఎన్నో ఘనకార్యాలు చేసినా, మనిషి బుద్ధి మాత్రం మారటంలేదు. సంకుచిత తత్వాన్ని మనసంతా నింపుకొని బతుకుతున్నాడు. కులమేదైనా, ఎన్నో యుగాల నుంచి నడిచి వస్తున్న కుసంస్కారం మనుషుల మధ్య విభేదాలను సృష్టిస్తూనే ఉంది. ఒక జాషువా, ఒక ఉన్నవ, ఒక ముప్పాళ్ళ రంగనాయకమ్మ, ఒక కందుకూరి, ఒక గురజాడ, ఒక జ్ఞానానందకవి... ఇలా ఎందరో మహాకవులు సమాజంలో నడుస్తున్న కులసంస్కృతికి బలైపోయారు. ఇప్పటికీ అదే స్థితి ఉందని యువకవి దార్ల ఇలా వర్ణిస్తున్నాడు.

దళితుడెంత యున్నత పదవినుండినా
కులము కర్మ యనుచు కూర్మి లేదు
భరతభూమినందు భాగ్యంబు చూడరా
దారి పూలతోట దార్ల మాట.

కులము, మతములన్ని కుత్సితబుద్ధులు
కలపవలయు గాని కలహమేల?
మంచికన్న మించు మానవత్వము లేదు
దారి పూలతోట దార్ల మాట.

ఈ లోకంలో మనిషి జీవితం బుద్బుదప్రాయం నీటి మీద మెరిసే బుడగ వంటిది అంటారు పెద్దలు. మానవుడు తాను జీవించేదెంత కాలమో తెలిసినా, మరణ రహస్యం తెలుసుకోవాలని ఎన్నో ప్రయోగాలు చేస్తూనే ఉన్నాడు. మనిషి శరీరం నుండి ప్రాణం ఎలా వస్తుందో, ప్రాణం ఎలా పోతుందో మాత్రం కనుగొనలేకపోతున్నాడు. మరొకవైపు మనిషి ప్రతి నిమిషం తన ఉనికి కోసం ఇతరులతో వాదులాడుతూనే ఉన్నాడు. మానవజీవితం వర్షపు చినుకు

లాంటిదనే తాత్త్వికదృష్టిని అలవర్చుకోలేకపోతున్నాడు. మానవుడికి తాను జీవించిన కాలాన్ని ఆనందమయంగా చేసుకోవడమే నిజమైన శాశ్వత తత్త్వం. మనిషి సుఖ దు:ఖాలకు స్పందిస్తూ, నిష్కల్మషంగా జీవించడమే జీవిత పరమార్థం. ఈ విషయాన్నే చెబుతూ దార్ల ఇలా వర్ణించాడు.

మనిషి మేఘమైన మనసెంత తేలిక
నింగి నిలుచు, మబ్బు నిలువదెపుడు
ఎగిరి వచ్చి చిలుక యేదొ పలికి పోయె
దారి పూలతోట దార్ల మాట.

ఈ పద్యంలో 'ఎగిరివచ్చి చిలుక యేదొ పలికిపోయె' అనడంలో ఆ రహస్యాన్ని మనకి అందిస్తున్నాడు దార్ల. మేఘానికి కదలిక ఉంటుంది. కదలికే నిత్య చైతన్యం. చైతన్యశీలి నిత్యం కలిగే మార్పుని గమనించగలుగుతాడు. ఈ పద్యంలో మేఘంలా మనిషి సుఖదు:ఖాలకు అతీతుడు కాడంటూనే, వాటిని మనసులోనే పెట్టుకుని క్రుంగిపోవడం మంచిదికాదనడానికి 'మబ్బు నిలువదెపుడు' అంటున్నాడు. సంతోషాల్ని పంచుకోవాలి. బాధల్ని ఒంపేసుకోవాలి. లేకపోతే మనిషి మనసు తేలికగా ఉండదు. మనిషి జీవితం కొన్నాళ్ళేనని తెలిసినా, దేనికోసమీ శాశ్వతమైన శత్రువైరుధ్యాలని చెప్పడానికే 'చిలుక' పలికి పోయిందంటున్నాడు. దాన్ని మరింత వివరిస్తున్నట్లు మరొక పద్యం వర్ణించాడు.

చిత్తమేమొ మబ్బు చిత్రముగ కదులు
అంబరంబెపుడును అట్లె యుండు
సత్యమిదియె పొందు నిత్యసంతోషంబు
దారి పూలతోట దార్ల మాట.

ఇటువంటి తాత్త్వికపరమైన పద్యాలు ఈ శతకంలో చాలా ఉన్నాయి. మన భాషలో ఉన్న తియ్యదనం మనకు తెలుసు. అయినంత మాత్రం చేత ఇతర భాషల్ని నేర్చుకోకపోతే నేడు మానవ మనుగడ అసాధ్యమవుతుంది. మన భాషను మనం కాపాడుకుంటూనే మనం ఇతర భాషల్ని కూడా నేర్చుకోవాలి, కానీ, మాతృభాషను మాత్రం మరచిపోవద్దంటున్నాడు మరో పద్యంలో దార్ల.

"అవసరంబు మేర యన్యభాషనయిన
మాటలాడ వలయు మరువవద్దు
మాతృభాషయేను మనకు జీవనమగు
దారి పూలతోట దార్ల మాట"

ఇలా సమకాలీన సమాజంలో మాతృభాషతో పాటు, ఇతర భాషల్ని నేర్చుకోవడమే కాకుండా, అన్యభాషా పదజాలాన్ని స్వీకరించాల్సిన అవసరాన్ని కూడా అనేకపద్యాల్లో వివరించాడు. తెలుగు భాషపట్ల తనకున్న దృక్పథాన్ని వివరిస్తూనే, పగలు-రాత్రి తేడా లేకుండా పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీవితాల్ని స్పర్శామాత్రంగా కొన్ని పద్యాల్లో వివరించాడు. కరువు నేలగా చెప్పుకునే రాయలసీమలో ఉన్న ఖనిజ సంపద, వేమన, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వంటి సంస్కరణవేత్తలు, పవిత్ర క్షేత్రాలెన్నో ఉన్న నేలగా అభివర్ణించాడు. దేవాలయాల సందర్శన రహస్యాల్ని, మనిషి అంతరంగాన్ని ఆవిష్కరించే పద్యాలు ఎన్నో దీనిలో ఉన్నాయి. సాహిత్య ప్రయోజనం గురించి కొన్ని పద్యాల్లో వర్ణించాడు. సాహిత్య పఠనం వల్ల మనసు ప్రశాంతంగా ఉండడమే కాకుండా, ఇతరుల మనస్తత్వాలు మనకి అర్థమవుతాయంటాడు దార్ల.

సర్వవేళందు సాహితీ పఠనంబు
మలినమవ్వు వేళ మనసునంత
సంస్కరించి మనకు సమదర్శనమునిచ్చు
దారి పూలతోట దార్ల మాట.

అలాగే, ఈ శతకాన్ని చదవడం ద్వారా దార్లకున్న పద్య రచనాభిలాషను, దేశభక్తిని, దైవభక్తిని తెలుసుకోవచ్చు. మనిషి మరణించిన తర్వాత భగవంతుడిలోనే లీనమౌతాడని విశ్వసిస్తూ...

పట్టుకొనుట యెట్లు పరమాత్మ గమనంబు
గాజుమేడ వోలె కదిలి కదిలి
తనువుపీడగానె దైవమై వెలుగురా
దారి పూలతోట దార్ల మాట.

అంటాడు దార్ల. ఈ శతకం వల్ల సమకాలీన సమాజంలో జరిగే అనేక అంశాలు పాఠకులకు తెలుస్తాయి. ఇలా ఎన్నో అంశాలపై పద్యాలు రాసి మనకు శతకంగా అందిస్తున్న దార్లకు నా అభినందనలు.

ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి,
డీన్, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్,
యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్.
హైదరాబాద్ - 500 046

విలక్షణ రసహృదయుడు దార్ల

ఆత్మీయ మిత్రులు దార్ల వెంకటేశ్వరరావు గారు వచన కవిత్వంతో ప్రారంభించి, పలు విమర్శ గ్రంథాల వరకు అనేక రచనలు చేశారు. సమకాలీన విమర్శ రచనలో తనదైన వాదంతో సాహితీప్రియుల అభిమానాన్ని పొందారు. ఇప్పుడు పద్య రచనతో తన ప్రతిభను చాటుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. సృజనకారుడైన వ్యక్తి ఏ పనిజేసినా ఆకర్షణీయంగానే ఉంటుంది. అందులోనూ నిత్యాధ్యయనశీలి, నిరంతర నవ్యతా ప్రియుడైన దార్లకు అనేక ప్రక్రియలతో పరిచయం ఏర్పడడం అత్యంత సహజం. అందులోనూ హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో పని చేసే అధ్యాపకుడికి పద్యాధ్యయనమూ అత్యంత సులభంగా అలవడుతుంది. ఆ అభ్యసన ఫలమే ఈ దార్లమాట శతక రచన. ఆత్మాన్వేషణకు, ఆత్మ నివేదనకు శతకం ప్రశస్త ప్రక్రియ. కవికి ఎలాంటి భేషజాలు లేనప్పుడు, తన హృదయంలో కలిగే అలజడికి బలమైన కవితా రూపమివ్వడానికి తమ భావహర్మ్యాలలో విహరిస్తూనే ఉంటారు. అయితే ఆ భావనను పద్యాలతో సంధించాలని భావించడమే విచిత్రం.

ఛందస్సంకెళ్లను ఛేదించకునే నేటి కాలంలో ఈ ఛందోబద్ధపద్యాలేమిటనే విచికిత్స రావడం సహజమే! కానీ, జాతి జీవితంలో శతాబ్దాలుగా కొనసాగుతూ సాహితీ రమణీయతను అద్భుతంగా అందించిన ఈ పద్యం, తనను సైతం సమ్మోహితుణ్ణి చేసిందని నిరూపించడానికే పద్య ప్రక్రియలో తన భావావిష్కరణ. పట్టువడినప్పుడు ఎంత సులభసాధ్యమో, ప్రారంభంలోని వారికి అంత కష్టమైనది పద్యం. దార్ల గారు చిన్ననాటి నుండే పద్య సాధన ప్రారంభించినందువల్ల ఆ ప్రక్రియలోని సొగసును అందించగలిగారు. ఈ పద్యాలను ఎంత సులభంగా నడపగలిగారో ఒక పద్యాన్ని చూడండి.

"వాక్కునర్థమెపుడు పార్వతీ శంకరుల్
కలిసి నిలువ గలుగు కవనమగుచు
శతకమొకటి చాలు శక్తి ముక్తియు కలుగు"

ప్రాచీన సాహిత్యం పట్ల గాఢాభిమానం లేకుండా ఇటువంటి పద్యాలను రచించడం గాని, వారి పట్ల గౌరవాన్ని ప్రకటించడం గానీ సాధ్యం కాదు. పద్య సాధనా ప్రియులకు అలవాటు చేయదగిన రీతిలో అలవోకగా ఆటవెలది పద్యాలను అందించి, ఆటవెలదికి మరింత ఆకర్షణీయతను కూర్చారు దార్ల. నేటి కాలంలో పెరిగిన సాంకేతికత కొన్ని సందర్భాలలో ఆనందాన్నిచ్చినా, మరి కొన్ని సమయాల్లో విసుగు కలిగించక మానదు. అటువంటి చీకాకును తెలిపే సమయంలో...

"వద్దనిన కుదరక వచ్చిపడుచు నుండు
మునిసిపాలిటీల మురికి వోలె
వాట్స 'పులుల' గుంపు వరమైన శాపంబు"

ఈ పద్యంలోని సాదృశ్యం 'మునిసిపాలిటీ మురికి' అది నిజానికి పూర్తిగా వదిలిపెట్టతగింది. కానీ 'వరమైన శాపం'గా వర్ణించాడు కవి. కొన్నిసార్లు వాట్సప్ వద్దనిపించినా అందులో మిత్రులు పంపే రకరకాల సందేశాలు, విశేషాలు ఏదో రకంగా మనసుకు ఉల్లాసం కలిగిస్తాయని చెప్పడానికే 'వరమైన శాపంబు' అని అభివర్ణించారు. ఆధునిక సమాజంలోని అవ్యవస్థను, బ్యాంకు నిర్వీర్యమవుతున్న దురవస్థను పద్యాల్లో వర్ణించారు దార్ల.

"పట్టపగలు దోచి నిట్టనిలువు ముంచు
'విజయమాల్య', 'మోడి' విజ్ఞులుండ
బ్యాంకు వైపు పోకు బాధలెక్కువగును"

అంటూ బ్యాంకులను బురిడీ కొట్టించే బడా వ్యాపారవేత్తల బండారాలను, వారికే బ్యాంకులు దోహదపడుతున్న తీరును తీవ్రంగా ఆక్షేపించాడు దార్ల.

ఈ శతకంలో తన వ్యక్తిగత అంశాల నుండి సామాజిక, సాహిత్య, తాత్త్విక అంశాల వరకు తనకు కలిగిన ప్రతిస్పందనకు చక్కని పద్యరూపాన్నిచ్చి వచన కవిత్వం ద్వారానే గాక, పద్య రచనలో సహితం తనకున్న ప్రావీణ్యాన్ని అందించాడు మిత్రుడు దార్ల.

సాధన చేసి ఆటవెలదిని తన వశం చేసుకున్నాడు దార్ల. తన నిరంతర సాహితీ కృషి పద్య రచనలో మరింత మెళకువను, వ్యక్తీకరణలో మరింత శక్తినీ, పద ప్రయోగంతో ప్రౌఢనీ సంతరింపజేసి పద్య ప్రియులకు 'దార్లమాట' శతక రచన దారి చూప' గలదని నా విశ్వాసం. తన రచనా విస్తృతితో బహు ప్రక్రియల్లో విలక్షణతను చాటుకుంటున్న రసహృదయులు దార్ల గారికి అభినందనలు తెలుపుతూ ఈ కృతి పాఠకుల మనస్సుల్లో మధుర భావనలను కలిగించగలదని గాఢంగా నమ్ముతున్నాను.

ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు

తెలుగుశాఖ, యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్.

సమకాలీన జీవితాలకు దర్పణం

'దార్ల మాట' శతకం

'దారి పూలతోట దార్ల మాట' అనే మకుటంతో కొనసాగిన ఈ శతక రచన గురించి ప్రస్తావించబోయే ముందు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారితో నాకుగల దాదాపు 30 సంవత్సరాల అనుబంధంలో నుండి కొన్ని విషయాలు ప్రస్తావించాలి. ఆచార్య 'దార్ల' నేటి తెలుగు సాహితీలోకంలో ఒక విలక్షణమైన వ్యక్తిగా ప్రసంశలు అందుకుంటున్నారు. ఒక సాధారణ కుటుంబం నుండి వచ్చి ఆర్థిక, సామాజిక అవరోధాలను అధిగమించి, అంచెలంచెలుగా ఎదిగి, ఈ రోజు సాహితీలోకంలో ప్రత్యేకంగా నిలవడం అనేది అంత సామాన్యమైన విషయం కాదని నా భావన.

నేడు దార్ల అంటే ఒక గొప్ప కవి. ఒక మంచి విమర్శకుడు, లోతైన విశ్లేషణలు చేయగలిగిన విశ్లేషకుడు. విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తూ వారిని నిరంతరం చైతన్య పరుస్తూ వారిని ఉన్నతులుగా తీర్చి దిద్దడం అనేవి వీరి సహజ గుణాలుగా చెప్పవచ్చు. వీరితో ఏమాత్రం పరిచయం ఉన్నా ఇవన్నీ అక్షర సత్యాలు అనేది స్పష్టంగా తెలుస్తుంది.

వీరికి బహుజన సాహిత్యం అన్నా, సాహిత్య విమర్శ అన్నా అమితమైన ఆసక్తి. అలాగే మిగిలిన విభాగాలలో కూడా లోతైన అధ్యయం చేసి పలువురి చేత ప్రశంసలు అందుకున్న ప్రజ్ఞ వారిది. అన్నిటికీ మించి ఒక విషయం మీతో ప్రస్తావించాలి. చదువుకున్న చోటనే బోధన చేసే అవకాశాన్ని పొందడం తన అదృష్టమైతే, చదువుకున్న గురువు చేతనే ప్రశంసింపబడడం వారి ప్రజ్ఞకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఒకనొక సందర్భంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, తెలుగుశాఖలో నిర్వహించిన ఒక సదస్సులో ఆచార్య దార్ల విమర్శ మీద మాట్లాడుతూ ఉంటే, అదే సభలో ప్రముఖ విమర్శకులు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారూ, నేనూ ప్రక్క ప్రక్కనే ఉన్నాం. దార్ల విమర్శ మీద చేస్తున్న ఉపన్యాసానికి ఆచార్య ముదిగొండ గారు ఎంత సంతోషించారో నాకు ప్రత్యక్షంగా తెలుసు. ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే ఆచార్య ముదిగొండ గారి దగ్గర చదువుకున్న వ్యక్తి దార్ల. తన శిష్యుడు తనకిష్టమైన రంగాన్ని ఎంచుకుని లోతైన విశ్లేషణ చేస్తుంటే ఆ గురువుకు అంతకంటే ఆనందం ఏముంటుంది?

ఇలా తన ప్రతిభతో నేటి సాహిత్యలోకంలో పరిచయం లేకుండానే అందరికీ ఆత్మీయ సాహితీ వ్యక్తిగా నిలిచిన వారు ఆచార్య దార్ల. నా దృష్టిలో దార్ల

అంటే గంభీరమైన వ్యక్తి, లోతైన అధ్యయనం చేసే సాహితీవేత్త, నిశితమైన విమర్శ చేయగలిగిన దిట్ట.

ఒకరోజు ఫోన్‌చేసి "అన్నా! ఒక శతకాన్ని రాశాను. దానిపై మీ అభిప్రాయం కావాలి" అంటే... నాకు ఏమి మాట్లాడాలో అర్థంకాలేదు. దార్ల ఏమిటి? శతకం రాయడమేంటి? వచన కవిత్వం, విమర్శలో మంచి పట్టు ఉంది గాని, దార్ల పద్యాలు రాయడం అనేది నాకు కొత్తగా అనిపించింది. ఎందుకంటే సాధారణంగా ఒక్కొక్క వ్యక్తి ఒక్కో విభాగంలో తన ప్రజ్ఞను ప్రదర్శిస్తూ ఉంటారు. అన్ని ప్రక్రియలలో సమానమైన ప్రజ్ఞ కలిగి ఉండడం అంత తేలికైన విషయం కాదు. ఒక వేళ దానిలో ప్రవేశించినా అంతగా గుర్తింపు ఉండదు. వారి మాట కాదన లేక సరే అని అంగీకరించాను. శతక ప్రతి చేతికొచ్చింది. మకుటం చూశాను "దారి పూలతోట దార్లమాట" చదివిన వెంటనే బాగా తెలిసిన పూలతోటలో విహరించినట్లు అలాగే ఏకబిగిగా మొత్తం ఒకేసారి చదివాను. ఆహా... దార్ల ఎంత గొప్పగా రాశాడు అనిపించింది.

ఎందుకంటే పద్యం రాయాలంటే, అందులోను శతక పద్యం రాయడమంటే కత్తిమీద సామే. ఎలా అంటే పరిధి తక్కువ, స్పష్టత ఎక్కువ, అంకుశం లాంటి సూటిదనం, విశేషమైన భాషాపరిజ్ఞానం, సందర్భోచిత చమత్కారం. అన్నింటికీ మించి సమస్య పట్ల పరిపూర్ణ అవగాహన ఇవన్నీ సమృద్ధిగా ఉంటేనే శతక పద్యం పాఠకులకు హత్తుకుంటుంది. ఈ 'దారి పూలతోట దార్లమాట' అనే దార్ల మాట శతకం చదివిన తరువాత ఈ లక్షణాలన్నీ ఆచార్య దార్లలో పుష్కలంగా ఉన్నాయని తెలిసింది. ఈ శతక ప్రక్రియ అనేది పాతదే అయినా అందులోని అంశం సమకాలీన సమాజం లోనిది. ప్రక్రియ ఏదైనా సమకాలీన సమాజానికి దర్పణంగా నిలువగలిగితేనే ఆ ప్రక్రియ ప్రజల హృదయాలలో శాశ్వతమైన స్థానం దక్కించుకుంటుంది. అందుకు చక్కని నిదర్శనం ఈ 'దారి పూలతోట దార్లమాట' శతకమే.

ఇందులోని పద్యాలన్నీ విశ్లేషించడం ఇక్కడ నాకు సాధ్యం కాదు, సమంజసం కాదు, అది నా బాధ్యత కూడా కాదు. కానీ మచ్చుకు ఒకటి, రెండింటిని ప్రస్తావించి ఈ శతకంలోని విశిష్టత ఎలాంటిదో తెలియజేస్తాను. పద్యం సంప్రదాయ పద్ధతికి సంబంధించినది కాబట్టి ఈ శతక ప్రారంభంలో వినాయకుడ్ని స్తుతించడం అనేది కవి ఆ సంప్రదాయాన్ని గౌరవించినట్లు అయింది. ఇక ప్రతి పద్యం సమకాలీన అంశాలను ప్రస్తావించినదే. రచన ఏరూపంలోనిదైనా పరమార్థం మాత్రం ప్రజలను, సమాజాన్ని చైతన్యపరుస్తూ వాస్తవాలవైపు పయనించేలా చేయాలి. అప్పుడే ఆ రచనకు సార్థకత ఉంటుంది. ఈ కోణంలో చూస్తే ఈ శతకం అక్షరాలా ఆధునికమే. ఉదాహరణకు కొన్నిటిని ప్రస్తావిస్తాను.

"దారి పూలతోట దార్లమాట" అనే మకుటాన్ని చూస్తేనే పాఠకులకు తెలియకుండానే ఆ 'పూలదారి'లోకి ప్రవేశించేలా చేస్తుంది. ఆ తరువాత దానిలోని ఎత్తు పల్లాలను స్పృశిస్తూ... లోతులను తడిమిచూస్తూ ఆలోచనల వైపు పయనింపజేస్తుంది.

ఉదా|| మద్యం సేవించి వాహనం నడపడం నేరం. అందుకు శిక్ష విధిస్తుంది ప్రభుత్వం. మరి ఓటు వేసేటప్పుడు అదే తప్పు జరిగితే అది తప్పు కాదా? అని ప్రశ్నిస్తున్నాడు కవి.

"త్రాగి కారు నడుప తప్పయినప్పుడు
ఓటు వేయునపుడు నోటునిచ్చి
తనకు వేయుమనుట తప్పు కాదందురా'

దీనిలో... రెండు వైవిధ్యమైన అంశాలను తీసుకుని, వాటిని పోల్చి తప్పొప్పులను విశ్లేషిస్తూ... మరి దీని పరమార్థ మేమిటో? అని ప్రశ్నించడం ఎంతో విలక్షణంగా ఉన్నది.

అంతేకాదు ఎన్నికల గురించి ప్రస్తావిస్తూ, ఎన్నికలు వస్తే నాయకులు ఎలా వస్తారో, వారు చేసే హడావిడి ఎన్నికల వేళ ఎలా ఉంటుందో అసలు సిసలైన చిత్రాలు ఈ పద్యంలో కళ్ళముందు దర్శనమిస్తాయి. అది ఎలా ఉంటుందంటే...

"కప్పలన్ని కలిసి చెప్పలేనంతగా
వర్షమొదవు లేళ హర్షమొందు
ఎన్నికలకు ముందు యెంత హడావిడో"

అంటూ ఎన్నికల సమయంలో నడిచే తతంగం అంతా సంక్షిప్తంగా ఆచార్య దార్ల తన పద్యంలో నిక్షిప్తంచేసిన విధానం బాగుంది.

ఈ మధ్య కాలంలో ప్రజలను స్తంభింప చేసి, జీవన విధానాన్నే ఉక్కిరి బిక్కిరి చేసిన సంఘటనలను ఒకటి రెండింటిని ప్రస్తావిస్తాను. అందులో మొదటిది ప్రస్తుతం నడుస్తున్న కరోనా విజృంభిస్తున్న కాలం అయితే, మరొకటి నోట్లు రద్దు చేసిన కాలం. ఆ కాలాల్లో ప్రజలు ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఆ నాటి పరిస్థితులను వర్ణించే ఒక పద్యం...

"నలిగిపోయె జనత నల్ల ధనము పేర
నోట్ల రద్దువలన కోట్లకొలది
చావురాక బతికి సన్యాసులయ్యేరు"

నల్లధనము వెలికి తీయడం సంగతేమో కాని ప్రజలు నలిగిపోయిన సంగతి ఎలాంటిదో కవి పై పద్యంలో విమర్శనాత్మకంగా తెలియజేసారు.

"క్రొత్తనోట్ల వలన కోరివచ్చుననిరి
నోట్లు రద్దు చేయ కోట్ల కొలది
నల్లధనము లేదు తెల్లధనము లేదు"

కొద్ది రోజులు కష్టపడితే దేశమంతా మారిపోతుంది, ప్రజలకు ఏదో జరుగుతుందని పలికిన ప్రగల్భాలు ఏమయ్యాయి? నల్లధనం లేదు, తెల్లధనం లేదు. చివరికి ప్రజలకు తిప్పలే మిగిలాయని కవి చమత్కారంగా వెల్లడించారు.

అలాగే, దేశం పరాయి పాలనలో ఉంది. అభివృద్ధి లేదు అంటూ, నాటి నుండి నేటి వరకు అనేక పోరాటాలు సాగించి స్వాతంత్ర్యాన్ని దక్కించుకున్నా ఏమీ ప్రయోజనం లేదు. ఇక్కడ అర్థం చేసుకోవాల్సింది తెల్లవారు – నల్లవారు అని కాదు, మంచి వ్యక్తిత్వం, మంచి మనసే ముఖ్యమని, అప్పుడే దేశం బాగుపడుతుందనే సత్యాన్ని తెలియజేశారు.

"తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చె
మారవలయు ముందు మనిషి మనసు
దేశమేదియైన దేవళంబౌనురా"

నేడు మాధ్యమాలలో వచ్చే "బిగ్‌బాస్ షో"కు ప్రజలు ఎలా హత్తుకుపోతున్నారో అందరికీ తెలిసిందే. ఇది రేటింగు కోసం వేసే వేషాలు అన్నీ ఇన్నీ కావు అంటూ అక్కడ జరిగే సంఘటనల గురించి ఇలా అంటారు.

"బిగ్గుబాసు నేడు బిగికౌగిలిల గూడు
సిగ్గు యెగ్గు లేదు సిన్నబోవ
యెంత రెచ్చిపోవ నంతరేటింగురా"

రేటింగుల కోసం ఆ టీ.వీ యాజమాన్యం పడే పాట్లు, అలాగే విన్నర్ కావడానికి పోటీ దారులు చేసే వికృత చేష్టలను దార్ల సూటిగా విమర్శించారు. ఇక్కడ సమాజంలో జరుగుతున్న సమకాలీనతను స్పష్టంగా గమనించవచ్చు.

శతక కవికి చమత్కారం, వెటకారం కూడా ఎంతో అవసరం. అవి ఆ శతక పద్యాలకు మరింత సొగసును తెస్తాయి. ఉదా॥....

నిదురపోకుమన్న నిదుర వచ్చునెపుడు
నిదురపోదమన్న నిదుర రాదు
తిండి, నిదుర రెండు తింగరిబుచ్చులే!

ఇది ప్రతి ఒక్కరి విషయంలో నిజమే. దీనిని ఎంతో చమత్కారంగా చెప్పడం విశేషం. అలాగే భావవీణ పత్రిక గురించి...

భావవీణ నేటి పరిశోధకులకున్న
వెలుగు నిచ్చు దివ్వె తెలుగునందు
భువనవిజయము వలె 'బూసి' పోషించురా

దీనిలో భావవీణ పత్రిక సేవను చక్కగా కొనియాడారు. ఆ పత్రికా సంపాదకుడు డా॥ బూసి వెంకటస్వామి అంకితభావాన్ని మెచ్చుకున్నారు. అలాగే మరోచోట రక్త సంబంధాల గురించి ముఖ్యంగా అన్నా చెల్లెల అనుబంధాన్ని ఎంత గొప్పగా చెప్పారో చూడండి. తన చెల్లెలు తమ నలుగురన్నదమ్ముల తర్వాత పుట్టిన అనురాగాల గారాల పట్టి 'విజయ కుమారి'ని నేటికీ చిన్న పిల్లగానే భావిస్తూ 'పాప' అని పిలుచుకోవడంలోని అనురాగాన్ని ఎంతో ఆత్మీయంగా వర్ణించడం కనిపిస్తుంది.

నలుగురన్నలకును వెలుగునిచ్చిన చెల్లి
పెద్దదైనగాని ముద్దుమాకు
'పాప' యగును 'విజయ' పసిపాప యెప్పుడూ!

మరో చోట తన భార్యను ఎలా మెప్పించవచ్చో దార్ల పలికిన ఈ పద్యాన్ని చూడండి.

వేడివేడిగాను వేగిరమే తింటి
పొయ్యిమీది వండు పొంగడంబు
మరిచిపోని వంట మంజుయే చేయురా

ఆ పద్యంలో పేర్కొన్న 'మంజు' ఎవరో కాదు మన శతక కర్త అయిన దార్ల గారి శ్రీమతే! ఇది వారి అన్యోన్య దాంపత్యానికి చక్కని నిదర్శనం.

అలాగే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల గురించి......

రాత్రి సంచరించు రాక్షసులను మాట
కృతయుగమున చెల్లు కలిని ననిన
సాఫ్టువేరు వాళ్ళు చావగొట్టి విడుచు

ఇలా చెప్పుకుంటూపోతే ఈ శతకంలో కార్పోరేటు వైద్యం, ఓట్ల రాజకీయం, మాతృభాషాభిమానం, జీవిత సత్యాలు, మానవసంబంధాలు, తాత్త్వికమైన అంశాలు, దైనందిన జీవన విశేషాలు, రాయలసీమ ఔన్నత్యం ఇలా అనేకాంశాలు ఈ 'దారి పూలతోట దార్ల మాట' శతకంలో ఉన్నాయి. ఈ

పద్యాలన్నీ మానవ సంబంధాల్లో కనిపించే వివిధ మానవత్వ పరిమళాలతో పలకరించుకుంటూ ముందుకు సాగడమే కాక, చక్కని జీవితానికి అనువైన మార్గాలను సూచిస్తాయి. దీనితో పాటు ఈ శతకాన్ని అల్పాక్షరాలతో అనల్పార్థం స్ఫురించేలా తీర్చిదిద్దారు. ఈ 'దారి పూలతోట దార్ల మాట' శతకంలోని సూక్తుల సుగంధాలు పాఠకుల మనసులను తాకి ఆలోచింపజేస్తూ, చైతన్య పరుస్తూ సమకాలీన జీవితానికి దర్పణంగా నిలుస్తుందని అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇది పాఠకుల మన్ననలను పొందడమే గాక ఆచార్య దార్లకు విశేషమైన కీర్తిని కూడా అందించగలదని విశ్వసిస్తూ, సామాజిక ప్రయోజనం కలిగే మరెన్నో రచనలు ఆచార్య దార్ల గారి కలం నుండి వెలువడాలని ఆశిస్తూ, మీ అందరినీ ఈ శతకాన్ని చదవమని ఆహ్వానిస్తున్నాను.

ఆచార్య విస్తాలి శంకర రావు

తెలుగు శాఖ అధ్యక్షుడు,

మద్రాసు విశ్వవిద్యాయం, చెన్నై.

సహృదయుడు దార్ల

కం. మా దార్ల మనసు వెన్నెల
ప్రాధాన్యతనిచ్చి కవుల పండితులను తా
నాదరము జూపి మమతా
మాధుర్యమొసంగి ప్రోచు మంజుల హృదితోన్.

తే.గీ. మధురకవి మల్లవరపు జాన్ మధుర పద్య
కవన భావ సౌరభ్య వైభవము గాంచి
మెచ్చి మెండు సమీక్షల నిచ్చి కవుల
మనసు దోచుకున్నారు నమ్మకము గలుగ!

డా॥ మల్లవరపు రాజేశ్వర రావు

22-10-2009

మిత్ర వాత్సల్యం

కం. మనుజుల తత్త్వము లరయుచు
మన దార్లాచార్యు లిపుడు మహనీయముగన్
కనుగొనుడని శతకములో
వినిపించెను మార్పుకోరి విజ్ఞులు మెచ్చన్.

కం. ముదిగొండాచార్యుండున్
ముదమొందెను మీదు ప్రతిభ ముచ్చట గొల్పన్
ఎదలో తానుప్పొంగుచు
తదనంతర మెరుకపరచె తగు వారలకున్.

కం. ప్రతిభామూర్తులు మిమ్ముల
స్తుతిచేసిరి శతకమందు చూచితి నార్యా!
ప్రతిపద్యము పరికించితి
నతిశ్రద్ధను వీడకుండ నంతము దాకన్.

కం. గురువుల మించిన శిష్యుని
మరచుట సాధ్యమ్ము కాదు మహనీయ గుణా!
సరితూగరు మీకెవ్వరు
స్థిరకీర్తిని పొందినారు చెదరక నెపుడున్.

కం. పదుగురితో కలిసి మెలసి
సదయుడవై మెలగుదువని సజ్జనులెల్లన్
హృదయమ్ము విశాలమనుచు
నెదలోపల నిల్పిరి మిము నెందరొ మిత్రుల్

కం. అల్పుని హిమశిఖరమ్మున
నిల్పిన మహనీయమూర్తి నిర్మలహృదితోన్
తెల్పితి నా యభిమతమున్
కల్పన లిసుమంత లేక కందములందున్.
కం. మన శ్రీనివాసు డెప్పుడు

మనసారగ మమత పంచి మసలెను మనతోన్
కనుగొంటిని పద్యమ్ముల
ననుదినమును వ్రాసి పంప నరసెను దయతోన్.

కం. సరదాకై నే వ్రాయుచు
పరిశీలన కొరకు పంపు పద్యములెల్లన్
దరహాసము నొలికించుచు
సరిచేయును దోషములను శ్రద్ధాసక్తిన్.

కం. గోవిందుని వంశజుడను
గోవర్ధన కవి సుతుడను కూర్చుచు కందాల్
ఏవిధముగ మీ ఋణమును
ధీవర్యా! తీర్చుకొందు తెలుపుము దార్లా!

గోవిందుని గోవర్ధన్

తెలుగు ఉపన్యాసకుడు, శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ప్రాచ్య కళాశాల, పాలెము

-★-

నిత్య కృషీవలుడు ఆచార్య దార్ల

ఆ.వే. ఆంధ్ర భాషయందు ఆచార్యవర్యులై
శిష్యకోటికిచ్చు శిక్షణయిది
వినుత కేంద్ర విశ్వవిద్యాలయ ఘనత
దార్లవారు పొందిదక్షులైరి

కం. నిత్యకృషీవలురై సా
హిత్య క్షేత్రాన కూర్చె హితమదియెంతో
సత్యమె నిలుపు జగమునను
నిత్యమదియె దార్లవారి నియమములందున్

ఆ.వే. మాటలందు మహిమ మణికాంతులను బోలు
మూసపోసె నిందు మూటగట్టి
మాటమాట యందు తేట తెలుగులూర
దార్లవారి రచన దారిచూపె

కవికోకిల **డా. జె.వి. చలపతిరావు**

2.6.2021

ఏమని వ్రాయాలి?

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారు తన శతకాన్ని నాకు అంకితమిస్తున్నానని, తమ అంగీకారాన్ని తెలియజేస్తూ అభిప్రాయాన్ని వ్రాసి పంపించమన్నారు. ఆయన గురించి ఏమి వ్రాయాలో నాకు క్షణకాలం పాటు ఏమీ తట్టలేదు. ఒక వ్యక్తి గురించి చెప్పాలన్నా, వ్రాయాలన్నా ఆయన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. కాని నేను ఆయన్నేమీ పరిశీలించలేదు. వారు నాకు చరవాణి ద్వారా పరిచయమయ్యారు. చాలా కాలం అలా మాట్లాడుకుంటున్నా, కాలం గడిచిపోతున్నా వారి వ్యక్తిగత విషయాలెప్పుడూ ప్రస్తావనకు రాలేదు. సాహిత్యం గురించే మాట్లాడేవారు. పోనీ, ఆయన్ని కనీసం చూడనైనా చూడను లేదు. కేవలం ఆయనను ఛాయాచిత్రం ద్వారానే చూడగలిగాను. ఆయన కవితలు మా పత్రికలో ప్రచురించేటప్పుడు ఫోటో పెట్టేవాణ్ణి. మా పత్రికలో సాధ్యమైనంతవరకూ కవులందరి ఫోటోలు కవిత్వంతో పాటు ప్రచురించడం రివాజు.

వెంకటేశ్వరరావుగారి మాటలు వింటే ఏదో ఒక భరోసా కలిగి నట్లుంటుంది. కులం, మతం, తనకున్న హోదా అవి ఏవీ ఆయన పట్టించుకోడు. కేవలం కష్టంతోనే ఎదగాలి... ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి... చేతనైతే సాయం చేయాలి... లేకుంటే దారి చూపాలని అంటారు పెద్దలు. ఆ కోవకు చెందిన వారు దార్ల. కొందరు దానాలు చేస్తే ప్రపంచానికి చాటుకుంటారు. మరి కొందరు సాయం చేస్తే తన పక్కనే ఉన్న మరో చేతికి కూడా తెలియనివ్వరు. ఈ చివరి కోవకు చెందిన వారే దార్ల వెంకటేశ్వరరావు.

వారు వ్రాసే పద్యాలు, కవితలు నాకు ఆదర్శం అని చెప్పక తప్పదు. వివిధ ప్రాంతాల్లో ఉన్న కవులు వ్రాసే కవితలను దృశ్య రూపంలో తీసుకుని వచ్చేందుకు వచ్చిన ఆలోచనలో భాగంగా ఒక షార్ట్‌ఫిల్మ్ (లఘు చిత్రాన్ని) చిత్రీకరించాను. నా తొలి లఘు చిత్రం పేరు "కవిత". ఈ లఘు చిత్రంలో దార్ల వెంకటేశ్వరరావు గారి తొలి కవితతోనే దాని చిత్రీకరణ జరిగింది. ఈ లఘు చిత్రాన్ని చూసిన ప్రముఖులు నివ్వెరపోయారు. నేను చిత్రీకరించిన తొలి లఘు చిత్రం దార్ల కవితతో ప్రారంభం కావడం నేను చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నాను... ఆయన వ్రాసే ప్రతి కవితలో ఏదో కొత్తదనం ఉంటుంది. ఆలోచింప జేస్తుంది. చేసిన సాయం మరువకూడదని... మానవ జన్మ పరులకోసమే అన్న భావన నాకు కలుగుతుంది.

కష్టపడే వారు... మంచి కార్యక్రమాలు చేపట్టే వారు ఏ స్థాయి వారైనా దార్ల తన హోదాను విస్మరించి ముందుకు సాగుతారు. నేనున్నాననే భరోసా

కల్పిస్తారు. దార్ల గురించి ఎంత చెప్పినా.. ఎంత వ్రాసినా తక్కువే. అయితే, వారి పక్కన ఉన్న వారికి గానీ, దూరంగా ఉన్న వారికి గానీ ఆయన అంత త్వరగా అర్థం కారు. ఆయన ఏవిషయంలోనూ అంతసులభంగా బయటపడరు. ఆచార్య పదవిలో ఉన్నా, దార్ల గారు ఓ సామాన్య వ్యక్తిలాగానే కలిసిపోతారు. అలాంటి మంచి మనస్సు వారిలో దాగి ఉంది. వీరి తల్లిదండ్రులు, గురువులు నేర్పిన సంస్కారం వీరిని ఈ స్థాయికి తీసుకొచ్చి ఇంత చిన్న వయసులోనే, తక్కువ సయమంలో సెంట్రల్ యూనివర్సిటీలో ఆచార్యుడు అనే ఉన్నత శిఖరాన్ని అందుకోగలిగారనిపిస్తుంది. ఇది పొగడ్త కాదు... నిజం!

నేటి సమాజంలో ఓ మనిషి పరిచయమైతే "దేవుడా... ఏంటో ఈ నస" అనుకుంటున్న ఈ రోజుల్లో, దార్ల గారు అవతలి వారు ఏ వయసులోని వారినైనా నవ్వుతూ ఆహ్లాదకరమైన చిరునవ్వుతో స్వాగతిస్తారు. ఇటువంటి మనస్సు ఉన్నవారు చాలా అరుదు. గత 30 సంవత్సరాలుగా జర్నలిజంలో ఉన్న నేను రాయలసీమ ప్రాంతంలో కర్నూలు కేంద్రంగా గణేష్ దిన పత్రికను స్థాపించి ప్రజల్లోకి తీసుకుని పోయే ప్రయత్నాలు సాగిస్తున్నాను. నేను ఏ విశ్వవిద్యాలయంలోనూ లేను. ఏ ప్రభుత్వ పదవిలోనూ లేను. అటువంటి నాకు దార్ల గారు పద్యశతకాన్ని నా ముందుపెట్టి, ఆ పుస్తకాన్ని అంకితమిస్తున్నాను అన్నారు. దార్ల గారు సామాన్యుడిలా ఉండే అసామాన్యుడు. ఆయన జీవితాన్ని గురించి చెప్పడం... వ్రాయడం నాకు సాహసమే. వారిని నొప్పించకూడదని... వారి మాటను కాదనలేక ఓ రెండు మాటలు వ్రాయాల్సి వచ్చింది. ఇందులో ఏమైనా తప్పుగా ఎవరికైనా అన్పిస్తే క్షమించగలరు.

మరో విషయమండి. దార్ల గారి శ్రీమతికి నా పాదాభివందనాలు. ఎందుకంటే కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు దార్ల గారు చేస్తున్న సేవలకు వారు అడ్డుచెప్పకుండా ఎంతగానో ప్రోత్సహిస్తున్నందుకు వారిని కూడా అభినందించక తప్పదు.

కొత్తూరు సత్యనారాయణ గుప్త

సంపాదకులు

గణేష్ దిన పత్రిక, కర్నూలు.

నా పద్య కవిత్వ నేపథ్యం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాదులో నిర్వహించిన తొలి ప్రపంచ మహాసభల్లో (2017) మా మిత్రుడు గోవిందుని గోవర్ధన్ కలిశాడు. అతడు వ్రాసిన ఒక పద్య శతకాన్ని నాచేతిలో పెట్టాడు. ఆ శతకం చదివిన తర్వాత నా పాత పద్యాలను వెతకాలనిపించింది. 'జీవితనావ' పేరుతో చిన్నప్పుడు కొన్ని పద్యాలు వ్రాసుకున్న గుర్తు. వెతికితే ఒక పద్యం కనిపించింది.

ఆ.వె. సాగరమును బోలు సంసారమీదినా
జీవితమగునొక్క చిన్ని నావ
దిక్కుతెలియకటుల తిరుగుట యేలరా
భక్తిపరుడవగుచు ముక్తి పొందు.

ఈ పద్యం దొరికినప్పుడు నాకెంతో సంతోషమనిపించింది. మిగతా పద్యాలు కూడా వెతకాలి. హైస్కూలులో తెలుగు పండితులుగా పనిచేసే మాగురువుగారు ఆతుకూరి లక్ష్మణరావు గారు బ్రాహ్మణులైనా నన్నెంతగానో ప్రోత్సహించేవారు. ఆయన రాగయుక్తంగా పద్యాలు పాడుతుండేవారు. క్లాసులో విద్యార్థుల చేత కూడా పద్యాలు చదివించేవారు. అప్పుడే నాకు ఛందస్సులో పద్యాలు వ్రాయాలనిపించి, నాలుగు వరుసల్లో వ్రాసి కొన్ని పద్యాలు వ్రాశాననుకునేవాడిని. కానీ, అలాగైనా ఒక్క పద్యం వ్రాయాలంటే ఒక వారమైనా పట్టేది. అలా నా ఆలోచనలన్నీ దానిమీదే పెట్టవలసి వచ్చేది. అలా కొన్నిపద్యాలు వ్రాసి మా తెలుగు మాస్టారుకి చూపించేవాణ్ణి. పద్యాన్ని చూసి గణాలు, యతులు, ప్రాసలు, అలంకారాలు, వ్యాకరణం, సమాసం మొదలైన వాటినన్నింటినీ ఆయన చెప్తుంటే నాకు సరిగ్గా అర్థమయ్యేది కాదు. ఇదేదో చాలా కష్టమైన పనేనని, అప్పుడింక వాటి జోలికి వెళ్లకూడదనుకునేవాణ్ణి. మరలా ఎం.ఏ.లో చేరిన తర్వాత కొన్ని పద్యాలు వ్రాశాను.

తే.గీ. మనసు మబ్బుల మెరుపులు మాటువేసి
ముట్టుకొనగాను షాకునే కొట్టినట్లు
కనులు మూసినా నీరూపు కనులనుండు
యేమి జేసితివే నువ్వు యెదను చేరి?

తే.గీ. వెంట్రుకలు లేకపోయినా వెఱ్ఱి మిగిలె
గుట్టుగానుండనివ్వని గుండు మిగిలె
దువ్వెనెన్నిమార్లు కదుల్చు దురద మిగిలె
బోల్డు హెడ్డు కల్పించునే భోగమదియె!

ఇలా ఏది తోస్తే దానిపై పద్యాలు వ్రాస్తుండేవాడిని. కానీ, వాటిని మిత్రులు చదవడమే తప్ప, పత్రికలకు పంపేవాడిని కాదు. పైగా, పత్రికల్లో వచనకవిత్వానికే అత్యధిక ప్రాధాన్యం లభించడం, చెప్పదలుచుకున్న భావాన్ని శక్తివంతంగా చెప్పడానికి ఆ వయసులో పద్యం సరైన వాహిక కాదనిపించి, వచనకవిత్వం వైపు మళ్ళాను. పత్రికల్లో, వివిధ కవితాసంపుటాల్లో నా వచనకవితలు విరివిగానే వచ్చాయి. వాటిలో కొన్నింటిని "నెమలికన్నులు" పేరుతో ఒక పుస్తకం కూడా ప్రచురించాను. త్వరలో మరో కవితా సంపుటి కూడా రాబోతుంది.

ఇదిలా కొనసాగుతుండగా, ఈ మధ్య కాలంలో ఛందోబద్ధమైన పద్యాలకు సంబంధించిన వాట్సప్ గ్రూపుల్లో తెలుగు పద్యాన్ని సులభంగా నేర్పడానికి అనేక ప్రయత్నాలు చేయడాన్ని గమనిస్తున్నాను. దీనిలో భాగంగానే శంకరాభరణం బ్లాగు, వాట్సపు గ్రూపులో రోజుకొక సమస్యనిచ్చి, పద్యపూరణాలు చేస్తున్నారు. వాటిని చదువుతుంటే నాకు కూడా ఆ పద్యపూరణాల్లో పాల్గొనాలనిపించేది. ముందుగా సరస్వతీమాతను ప్రసన్నం చేసుకోవాలనుకొని ఒక పద్యాన్ని, అమ్మ గురించి మరొక పద్యాన్ని వ్రాశాను.

కం. ప్రార్థించగ వాగ్దేవత
వ్యర్థంబవ్వని పదంబు వరమివ్వంగన్
స్వార్థంబులేక కృతిపర
మార్థంబే శుభకరంబు మరువకు దార్లా!

కం. అమ్మకు చేయగ నంజలి
కమ్మగ చెప్పెను కవనము కస్తూరివలెన్
నమ్ముమెపుడు కవి జన్మకు
అమ్మను వర్ణించుటె శుభమౌ గద దార్లా!

ఆ తర్వాత పద్యసాధన చేయడం ప్రారంభించిన తర్వాత నాలో నేను ఏ పద్యాలెలా ఉంటాయో? ఏవైతే బాగుంటాయో? ఏ భావానికి ఏ పద్యం వ్రాయాలో క్షేమేంద్రులు వ్రాసిన 'సువృత్తతిలకము' వంటి పుస్తకాల్లో చెప్పినా, నా ఆచరణలోకి వచ్చేసరికి మాత్రం పద్యం వ్రాయడం చాలా కష్టమనిపించేది. ఆ పద్య వర్ణనానుభవాల్నికూడా కొన్ని పద్యాల్లో వ్రాసుకున్నాను.

ఆ.వె. ఆట వెలది యెదను ఆడెను పాడెను
తేట గీతి తీపి తేనె తీరు
కంద మేమొ కన్య అందరి కందునా
దారి పూల తోట దార్ల మాట.

కం. అందముగానొక పద్యము
కందము చెప్పవలయునని కలలను కంటిన్
ఛందము బంధము కాగా
సుందరమగు పద్యరీతి సులువగు నాకున్ ?

శంకరాభరణం వాట్సప్ గ్రూపులో సమస్యా పూరణను చదువుతూ, నేను కూడా కొన్ని పూరణలు చేసినప్పుడు ఆ గ్రూపు నిర్వహిస్తున్న కంది శంకరయ్యగారు, డా॥ వెలుదండ సత్యనారాయణగారు ఎంతగానో ప్రోత్సహించేవారు. శంకరాభరణం వాట్సప్ గ్రూపులో **"ఖరపథంబు సౌఖ్యకారకంబు"** అనే ఒక సమస్యకు ఒక పద్యాన్నిలా పూరించాను.

ఆ.వె. పగలు రాత్రి వేడి పట్టి పీడింపగా
ఊపిరాడనట్టులుండు వేళ
వేయిమాటలేల వెడలవలె హిమ శి
ఖరపథంబు సౌఖ్యకారకంబు.

దాన్ని పూరించినప్పుడు శంకరయ్య గారు ప్రోత్సాహకరంగా మెచ్చుకున్నప్పుడు ఆయన గురించి ఒక పద్యాన్నిలా వ్రాసుకున్నాను.

తే.గీ. దక్కెనంచు నెగిరెగిరి దాచుకొందు
జీవితాంతము వరకు సజీవముగను
సరస పద్యగురువు గారు శంకరయ్య
పలికిన తొలి ప్రశంసల పలుకులెల్ల!

శంకరాభరణం గ్రూపులో సంభాషణలు కూడా పద్యాల్లో సాగించేవారు. పద్యంలోని ఒక పాదాన్ని తమ సంభాషణగా ఉపయోగించుకునేవారు. అవన్నీ పద్యాలు వ్రాసేవారికి కొత్త ఉత్సాహాన్నిస్తాయి. శంకరాభరణం వాట్సప్ గ్రూపులో పద్యాలు వ్రాసేవాళ్ళలో ఆసక్తి ఉన్నవాళ్ళు 'జడ'పై కందంలో రాస్తే రెండేసి పద్యాల చొప్పున కవుల సహకార పద్ధతిలో ఒక పుస్తకంగా ప్రచురిద్దామన్నారు. నేను కూడా వ్రాశాను. చిన్న చిన్న మార్పులు చేసి నావి కూడా రెండు పద్యాలను 'జడకందము' పుస్తకంలో తీసుకున్నారు. నాకు రెండు పుస్తకాల్ని పంపిస్తూ దానితో పాటు ఒక ప్రశంసాపత్రాన్ని కూడా పంపించారు.

నేను పద్యాలను వ్రాస్తానని నాకు, నా మిత్రులకు తప్ప ఇంకెవరికీ తెలియదనుకుంటున్న తరుణంలో పద్యకవులను పరిచయం చేస్తూ ప్రముఖ పద్యకవి సవ్వప్పగారి వీరన్న ఒక పుస్తకం ప్రచురిస్తున్నానని నా పద్యాలను కూడా కొన్నింటిని పరిచయం చేశారు. వాటిని పుస్తకంలో చూసుకొని ఎంతగానో

మురిసిపోయాను. మరికొన్ని పద్యాలను వ్రాయకపోతే, పద్యకవిగా పరిచయం చేసిన దానికి సార్థకత ఉండదనిపించింది. ఆ విధంగా కూడా కొన్ని పద్యాలను వ్రాయాలనుకున్నాను. వీరన్నగారు చేస్తున్న కృషిని ప్రశంసించాలనిపిస్తూ ఒక పద్యంలో ఇలా చెప్పే ప్రయత్నం చేశాను.

ఆ.వె. నిత్యమతడు తిరుగు సత్యశోధన చేయ
పద్యరచన కతడు పరవశించు
యేదియేమి యైన వేయునో గ్రంథంబు
నీతిగాను బ్రతుకు జాతి కొరకు!

శంకరాభరణం గ్రూపుని పరిచయం చేసిన మిత్రుడు గోవర్ధన్ కూడా నేను పద్యాలు వ్రాయాలని ప్రోత్సహించేవాడు. "ఈ వేళ ఏమి రాశా" రని అడుగుతుండేవాడు. దానికి సమాధానాన్ని పద్యాల్లో చెప్పే ప్రయత్నం చేస్తూ పద్యాల్ని అభ్యసించేవాణ్ణి.

తే.గీ. నిదుర పోలేదు మిత్రమా నిజము నిజము
పద్య పూరణ మనియెడు ప్రాణ సకియ
నన్ను రాతిరి యంతయు నవ్య భావ
నలకు వేదిక జేయుచు నాడుచుండె.

అన్యభాషాపదాల్ని ఉపయోగిస్తూ కూడా సరదాగా కొన్ని పద్యాలను వ్రాస్తుండేవాడిని.

కం. వాకింగు చేయుచూ నే
టాకింగున పద్యమొకటి టక్కున చెప్పన్
షాకింగగుచూ జనులే
ప్యాకింగున తెచ్చె దూది పరుగున దార్లా!

కం. డ్యూటీపుల్లే మదరు
క్యూటీ బేబీయె చెల్లి కూరిమి నింపన్
బ్యూటీఫుల్లగు వైఫే
బేటీయేపెంకిపిల్ల బెదరకు దార్లా!

అయితే, ప్రయోగాలనేవి తెలిసి చెయ్యాలి. తెలియకుండా చేస్తే అవి ప్రయోగాలు కాదు, ప్రయత్నాలు మాత్రమే. నావి పద్యాలు వ్రాయాలనే ప్రయత్నాలు మాత్రమే. ఈ పద్యాలను కొన్నింటిని మా సెంట్రల్ యూనివర్సిటీలో సహ అధ్యాపకుల్లో ఒకరైన ఆచార్య రేమిళ్ళ వేంకట రామకృష్ణశాస్త్రి గారు చూసి

కొన్ని సూచనలు చేసేవారు. ఈ సందర్భంగా వారికి కూడా నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

కేవలం పద్యాలు వ్రాయడం మాత్రమే కాకుండా నాకెందుకో నామముద్రతో ఒక మకుటం సమకూర్చుకుంటే బాగుంటుందనిపించింది. 'దారి పూలతోట దార్లమాట'ను మకుటంగా పెట్టుకొని ప్రస్తుతానికి కొన్ని ఆటవెలది పద్యాలు వ్రాశాను. వీటిలో కొన్ని పద్యాలను 'దార్ల మాట శతకము'గా ప్రచురిస్తున్నాను. కందంలో సుమారు 70 పద్యాలు, తేటగీతి, సీసం తదితర ఛందస్సుల్లో కూడా కొన్ని పద్యాలను వ్రాశాను. వారణాసి వెళ్ళినప్పుడు (ఫిబ్రవరి, 2018) ఆ ప్రయాణాన్ని వర్ణిస్తూ ఎప్పటికప్పుడు కొన్ని పద్యాలను వాట్సప్ స్టేటస్‌లో ఫోటోతో సహా పెట్టేవాణ్ణి. అలాగే నేను చూసిన అనేక సంఘటనలను పద్యాలుగా వ్రాసే ప్రయత్నం చేసేవాణ్ణి. అభ్యాసంలో భాగంగా ప్రసిద్ధ శతకపద్యాలు, కావ్యాల్లోని పద్యాలను అనుకరిస్తూ కూడా కొన్ని పద్యాలను వ్రాసేవాణ్ణి . ప్రముఖ పద్య కవులు మల్లవరపు జాన్ కవి గారి 'ముంతాజ్ మహల్' కావ్యావిష్కరణకు ఒంగోలు వెళ్ళినప్పుడు (1997), ఆయన్ని కలిశాను. వారిని కలవడమే ఒక గొప్ప అదృష్టంగా భావిస్తుంటే, ఆ సహృదయులు, ప్రేమమూర్తి ఆశువుగా నాపై ఒక పద్యాన్ని చెప్పడం మరింత అదృష్టమనిపించింది. అది నా పర్స్‌లో పెట్టుకొని హైదరాబాదు వచ్చి చూసుకుంటే పర్సు లేదు. బస్సులో ఎవరో దొంగిలించారు. దానిలో పోయిన డబ్బుకంటే పోగొట్టుకున్న ఆ పద్యం గురించే నేటికీ తలచుకున్నప్పుడల్లా బాధ అనిపిస్తుంది. అయితే, ఆయన పేరు మీద ఏర్పాటు చేసిన పరిశోధన, విమర్శ తొలి పురస్కారం నాకు రావడం నిజంగా ఒక మధురానుభూతితో కూడిన ఆనందం అనిపించింది. ఆ తర్వాత యేడాది పురస్కారాన్ని డా॥ పత్తిపాక మోహన్‌గార్కి ప్రకటించారు. అప్పుడు ఒక పద్యాన్నిలా వ్రాసుకున్నాను.

తే.గీ. మధురకవి బిరుదు మెరిసె మల్లవరపు
జాను కవిగారి సాహితీ జగము నందు
వారి కీర్తికిరణములు వరుసగాను
దార్ల, పత్తిపాక కవుల దరికి చేరె!

ఇలాంటి వాటిని వదిలేస్తే ఎలా అనిపిస్తుంది. అయినా వాటిని అన్నింటినీ దాచుకుంటున్నాను. చాలా వరకూ వాటిని నా బ్లాగులో ఎప్పటికప్పుడు ప్రచురించుకొని భద్రపరుచుకుంటున్నాను.

ఈ మధ్యనే మా ఒడిలోకొచ్చిన పుత్రరత్నం శ్రీనివాసరావు చేసే చేష్టల్ని వర్ణిస్తూ సుమారు 50 పద్యాలను వ్రాశాను. వీటిలో చాలా వరకూ, అంటే

పంపించినంతవరకూ కర్నూలు నుండి వెలువడే గణేష్ దినపత్రికలో ప్రచురితమయ్యాయి. వాటిలో ఐదు పద్యాలను ఇక్కడ పరిచయం చేస్తాను.

ఆ.వె. శ్రీనివాసుడితడు శిశువురూపమునొంది
సేవచేసుకొనగ చేరిరాగ
పాలు కలిపి పెడితి పద్యమొక్కొక్కటి!
శిశువు చేష్టలేమి చిత్రమౌర! 1

ఆ.వె. క్రొత్త వెలుగు తెచ్చి కోటికాంతులనివ్వ
చిమ్మచీకటంత చీలిపోవ
దివ్యముగను జేసె దీపావళిని మాకు
శిశువు చేష్టలేమి చిత్రమౌర! 2

ఆ.వె. అర్ధరాత్రి లేదు అపరాత్రి యనిలేదు
ఆటలాడుకొనుట అతడి హక్కు
కాచుకొనగవలయు కనుపాపవోలెరా
శిశువు చేష్టలేమి చిత్రమౌర! 3

ఆ.వె. తనివి తీరదాయె తనయుల ముద్దాడ
ముద్దు తీరదాయె ముచ్చటించ
ముచ్చటాగదాయె మురిపించు మాటలు
శిశువు చేష్ట లేమి చిత్రమౌర! 4

ఆ.వె. మాట మాట కలిపి మరుమల్లె జల్లుల్ని
చిలకరించునయ్య చిన్నితండ్రి
మ్రోడువారిన యెద మొక్క మొలుచునయ్య!
శిశువు చేష్టలేమి చిత్రమౌర! 5

పాతాన్ని బాగా చెప్పిన రోజునా, క్రొత్త విషయాన్ని అందించిన రోజునా, క్రొత్త విషయాన్ని కనుగొన్న రోజునా పొందిన ఆనందాన్ని కూడా ఒక పద్యంలో దాచుకోవాలనిపిస్తుంది. శతకం పూర్తి అయిన తర్వాత వాటిని ప్రత్యేకంగా ఒక పుస్తకంగా ప్రచురించాలనుకొంటున్నాను.

తే.గీ. హృదయమంత సంతసమగు బుధజనుడికి
నిత్య సత్యశోధనమున, సత్యదృష్టి
నిత్య సృజనలతోనుండు కృత్య మదియె
పాఠమున మునిగిన నెంత పరవశంబు

నేను వ్రాస్తున్న పద్యాలను ఎప్పటికప్పుడు సిరా ఆరకముందే గణేష్ పత్రికకు పంపిస్తుంటే, వారు ప్రచురించేవారు. “దోషాల సంగతి నాకనవసరం.

మీరు పంపించిందాన్ని పంపించినట్లే ప్రచురిస్తా" ననేవారు. ఈ సందర్భంగా గణేష్ పత్రిక సంపాదకుల గొప్పతనాన్ని ముచ్చటించుకోవాలి. ఆయన గొప్ప సాహితీప్రియుడు. కవుల వెంటపడి మరీ కవిత్వం వ్రాయిస్తారు. కవులకు ఫోను చేసి మాట్లాడతారు. కవులకు కేవలం తన పత్రికను వేదికగా చేయడమే కాకుండా, కవిసమ్మేళనాల్ని కూడా నిర్వహిస్తారు. తాను సాహిత్యకార్యక్రమాల్ని అన్నింటిని నిర్వహించడానికి తానేమీ ధనవంతుడిని కాదంటారు. కర్నూలులో ఆయన పుస్తకావిష్కరణకు నన్ను ముఖ్యఅతిథిగా పిలిచినప్పుడు వారి ఇంటికెళ్ళి చూశాను. చిన్న ఇల్లు. ఒక కంప్యూటర్. ఒక లాండ్ లైన్ ఫోను. వాటితోనే గణేష్ పత్రికను నడుపుతున్నారు. ఆయనకు తన కుమారుడు, కూతురు టైపింగ్‌లో సహకరిస్తుంటారు. అయినా, తన సాహిత్య సభలను నిరంతరం నిర్వహిస్తూనే ఉంటారు. *తమ తండ్రి గారు చెప్పిన మాటలకు కట్టుబడి ఈ సాహిత్య సేవ చేస్తున్నారు. తండ్రి ఉండగానే తండ్రి మాటలను పెడచెవిని పెట్టే తనయులున్న ఈ రోజుల్లో కూడా తమ తండ్రి గారు లేకపోయినా ఆయన మాటకు విలువనిచ్చి, సాహితీ సేవ చేస్తున్న సత్యనారాయణ గుప్తా గారిది అరుదైన వ్యక్తిత్వం*. మరొకవైపు రాయలసీమ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయానికి ఒక ఉద్యమ నాయకుడిలా నిరంతరం స్పందిస్తూనే ఉన్నారు. తన పత్రికలో ప్రకటనలకోసం ఆయనేనాడూ అఱ్ఱులు చాచడాన్ని నేను ఆయనలో గమనించలేదు. కానీ, కవిత్వాన్ని పంపకపోతే మాత్రం ఊరుకోరు. అందుకే ఆయన ఫోనంటే కవులకు భయం. ప్రేమతో కూడిన భయం. అలా సాహిత్యసేవ చేస్తున్నందుకే ఈ పుస్తకాన్ని ఆయనకు అంకితం చేస్తున్నాను.

సమాజంలో జరిగే అనేక విషయాల పట్ల నాకు కలిగిన స్పందనలే ఈ పద్యాలు. వీటిని వ్రాసిన వెంటనే నా వాట్సాప్ స్టేటస్‌లో భావానుగుణమైన ఒక ఫోటోతో ప్రచురించేవాణ్ణి. చాలామంది వాటిని చదివి వెంటనే తమ స్పందనలను కూడా తెలిపేవారు. ఆ పద్యాలను చదివి మా మిత్రులు, విద్యార్థులు కూడా కొన్ని పద్యాలను వ్రాస్తుండేవారు. మా దగ్గర చదివిన కోటేశ్ ఏకంగా శతకమే వ్రాసాడు. వాట్సాప్ లో నా పద్యాలే ప్రేరణ అని అతడు చెప్పినప్పుడు నాకే ఇంత సంతోషంగా ఉంటే, అనేక వందలమందిని పద్య ప్రియులుగా తయారుచేస్తున్న కంది శంకరయ్య గారు ఇంకెంతగా మురిసిపోతారో అనిపించేది. అందుకే ఆయన్ని నేను "గురువు గారూ!" అని సంబోధిస్తాను. అనేకమంది పద్య కవులకు ఆయన నిజంగానే గురువు గారు.

ఒక్కొక్కసారి మంచి భావం వచ్చిందనిపిందంటే అర్ధరాత్రి కూడా లేచి మొబైల్‌లో పద్యం వ్రాసుకునేవాణ్ణి. ఒక భావావేశం విలువేంటో తెలిసిన సాహితీవేత్త నా భార్య డా॥ మంజుశ్రీ. ప్రాచీన సాహిత్యం పట్ల మంచి అభిరుచి ఉన్న వ్యక్తి. తాను అలవరచుకున్న సరస్వతీ శిశుమందిరంలోని అలవాట్లే నేటికీ

కొనసాగిస్తుంటుంది. నేను పద్యాలు వ్రాస్తుంటే సంతోషపడిన మొదటి వ్యక్తి కూడా ఆమే కావడం ఓ విశేషం. ఆమె కూడా తెలుగు అధ్యాపకురాలు కావడంతో అప్పుడప్పుడు ఆమె ఏదైనా సరదాగా అంటే దానికి సమాధానాన్ని కూడా సరదాగానే ఒక్కోసారి పద్యాల్లో చూపిస్తుంటాను. ఒకసారి ఏదో సందర్భంలో "ముచ్చి మొహం"అంది. దానికి ప్రతిగా నేనొక పద్యాన్నిలా వ్రాసి చూపించాను.

తే.గీ. 'ముచ్చిమొహమ'ని తిట్టియు ముద్దు మొగము
నని తినని హాస్యమాడుచు నాటపట్టు
సరసురాలైన భార్యకే సాధ్యమదియు
నొచ్చుకొనుటయె మనజాతి ముచ్చటనుము!

పద్యాన్ని చూసి ముసిముసి నవ్వులతో మురిసిపోయింది. ఇలా కొనసాగుతోంది నా పద్యకవిత్వం. ఇదీ నా పద్యకవిత్వ నేపథ్యం. పద్యంలో దోషాలున్నాయని చెప్పినంత తేలిక కాదు వ్రాయడమని అర్థమైంది. నా పద్యాల్లో కూడా దోషాలుండవచ్చు. గురువు గారు కంది శంకరయ్య గారు నా ముద్ర, నా ఆత్మీయత చెరిగిపోకుండా ఈ పద్యాల్లో కొన్ని దోషాల్ని సరిచేశారు. వారి వయోభారం, ఇతర వ్యాపకాల కారణంగా అన్నీ సరిచేయడం సాధ్యం కాకపోవచ్చు. పెద్దలు, సంబంధిత రంగంలో కృషిచేసిన వారిచ్చే సూచనలను శిరసావహిస్తానని, మలిముద్రణలో వాటిని సవరించుకుంటానని వినయపూర్వకంగా తెలియజేస్తున్నాను. కొన్ని పద్యాలకు సమన్వయం సరిపోతుందా అనే అనుమానం కూడా రావచ్చు. అది కొన్ని పద్యాలలో నిజము కూడా అనిపిస్తుంది. పద్యాలను వ్రాసుకునేటప్పుడు వాట్సప్ స్టేటస్‌లో ఫోటో పెట్టడం వల్ల అవి సరిపోయేవి. విడిగా ఆ భావం కొన్నింటిలో స్ఫురించడం కష్టమని కూడా అంగీకరిస్తున్నాను. ఇదొక ప్రయత్నంగా మాత్రమే భావించమని, పద్యం పట్ల గల ఆసక్తినీ, ఇష్టాన్నీ ఇలా మీతో పంచుకుంటున్నానని గమనించమని పాఠకులను కోరుతున్నాను.

దార్ల వెంకటేశ్వర రావు

కృతజ్ఞతలు

నన్ను కని, పెంచి, చదివించిన తల్లిదండ్రులు కీ.శే. దార్ల అబ్బాయి (శ్రీలంకయ్య), శ్రీమతి పెదనాగమ్మ గార్లకూ, ఈ పుస్తకాన్ని అంకితం తీసుకుంటూ నా గురించి నాలుగు మంచి మాటలు వ్రాసిన గణేష్ పత్రిక సంపాదకులు శ్రీ కొత్తూరు సత్యనారాయణ గుప్తాగారికి,

ఈ శతకానికి ప్రోత్సాహకరమైన ముందుమాటలు వ్రాసిన మా గురువు గారు ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి గార్కి, ప్రముఖ సాహితీ ప్రియుడు, మా సహోధ్యాపకుడు ఆచార్య పిల్లలమర్రి రాములు గార్కి, నన్నెంతగానో ప్రోత్సహించే అన్న ఆచార్య విస్తాలి శంకర రావు గార్కి, సహృదయులు మద్రాసు క్రిస్టియన్ కళాశాల ప్రొఫెసర్ శ్రీపురం యజ్ఞశేఖర్ గార్కి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

శంకరాభరణం వాట్సాప్ గ్రూపు అడ్మిన్, ప్రముఖ పద్యకవి, 'సమస్యా పృచ్ఛక చక్రవర్తి' కంది శంకరయ్య గారి ప్రేరణతో మరలా పద్యాలు వ్రాయడం ప్రారంభించాను. అలా వ్రాసిన ఈ పద్యాలను మా మిత్రుడు గోవిందుని గోవర్ధన్ సూచన మేరకు శ్రీ కంది శంకరయ్యగారికి పంపించాను. దయచేసి ఈ పద్యాల్లో మార్పులు, చేర్పులు చేయమని అభ్యర్థించాను. వారు అంగీకరించారు. వారు ఈ పద్యాన్నింటినీ చూడ్డం, సూచనలు చేయడం వల్ల నాకు కొంత ఆత్మవిశ్వాసం కలిగింది. అందుకే దీన్ని ప్రచురిస్తున్నాను. నా పద్యాలను సరిచేసి, 'పూలు పరచిన దార్లలో' అంటూ ఆయన వ్రాసిన మాటలు ఎంతో విలువైనవి. అందుకు శ్రీ కంది శంకరయ్య గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

నన్ను మళ్ళీ పద్యం కూడా వ్రాయమంటూ ప్రోత్సహిస్తూ వ్రాస్తున్నప్పుడే ఆ పద్యాలను సరిచేసి పంపిస్తూ, నా గురించి అనేక పద్యాలను వ్రాసే నా ప్రియ మిత్రుడు గోవిందుని గోవర్ధన్ గార్కి, శ్రీ కంది శంకరయ్య గార్ని సంప్రదించక ముందే ఈ పద్యాలను ఒకసారి చూసి సూచనలు చేయమని అడిగిన వెంటనే చూసిన నా క్లాస్‌మేట్ ప్రస్తుతం అసిస్టెంటు ప్రొఫెసరుగా పనిచేస్తున్న డా॥ జి. శ్రీనివాసరావు గార్కి, అన్నింటా సహకరించే నా భార్య డా॥ ఎం. మంజుశ్రీకి, పుస్తకానికి తన ఫోటోతో మరింత అందాన్ని పెంచిన మా పుత్రరత్నం శ్రీనివాసరావుకీ, నాతోనే ఉంటూ, నిత్యం నాకెంతో అండగా ఉండే నా పరిశోధక మిత్రుడు రామ్ ప్రసాద్ నలసానికి నా శుభాశీస్సులు. ఈ పుస్తకానికి ముఖచిత్రాన్ని అందంగా సమకూర్చిన విట్టుబాబు గారికి, డి.టి.పి., ప్రింటింగ్ పనులన్నీ చేసిపెట్టిన శ్రీ కంది శంకరయ్య గారికి నా కృతజ్ఞతలు.

దార్ల వెంకటేశ్వర రావు

'దార్ల మాట' శతకం

శ్రీగణపతి దేవ! శివపార్వతీ పుత్ర!
నీదు దయను పొంద నిన్ను తలతు
పద్యవిద్య సుజన హృద్యంబు చేయరా
దారి పూలతోట దార్ల మాట. 1

కష్టలన్ని కలిసి చెప్పలేనంతగా
వర్షమొదవు వేళ హర్షమొందు
ఎన్నికలకు ముందు ఎంత హడావిడో
దారి పూలతోట దార్ల మాట. 2

త్రాగి కారు నడుప తప్పయినప్పుడు
ఓటు వేయునపుడు నోటునిచ్చి
తనకు వేయుమనుట తప్పు కాదందురా
దారి పూలతోట దార్ల మాట. 3

కట్టుకున్న హాయి కాటను చీరయే
పెట్టవలయు గంజి పట్టుబట్టి
ఉతికినప్పుడల్ల బ్రతుకేమొ బేజారు
దారి పూలతోట దార్ల మాట. 4

వద్దనిన కుదరక వచ్చిపడుచు నుండు
మునిసిపాలిటీల మురికి వోలె
వాట్స 'పులుల' గుంపు వరమైన శాపంబు
దారి పూలతోట దార్ల మాట. 5

ఉప్పు, పసుపు, వేప ఉన్నవనుచునమ్ము
బహుళజాతి వారు బావుకొనగ
మంచిదన్న చాలు మనమంత సిద్ధమే
దారి పూలతోట దార్ల మాట. 6

అమ్మ యనెడు మాట అమృతంబు కురిపించు
అయ్య యనెడు మాట హాయినిచ్చు
మమ్మి డాడి యనెడు మాటలింకేరా
దారి పూలతోట దార్ల మాట. 7

వాక్కునర్థమెపుడు పార్వతీశంకరుల్
కలిసి నిలువగలుగు కవనమగుచు
శతకమొకటిచాలు శక్తి ముక్తియు కలుగు
దారి పూలతోట దార్ల మాట. 8

వ్యాస, కాళిదాస, వాల్మీకులాదిగా
కలరు కవులు భావుకత్వనిధులు
అద్భుతమగు కవన మందించు సద్బుద్ధి
దారి పూలతోట దార్ల మాట. 9

మనిషి మేఘమైన మనసెంత తేలిక
నింగి నిలుచు, మబ్బు నిలువదెపుడు
ఎగిరి వచ్చి చిలుక యేదొ పలికిపోయె
దారి పూలతోట దార్ల మాట. 10

చిత్తమేమొ మబ్బు చిత్రముగ కదులు
అంబరంబు సతత మట్లె యుండు
సత్యమిదియె పొందు నిత్యసంతోషంబు
దారి పూలతోట దార్ల మాట. 11

తిన గలిగిన నాడు తిండి దొరకకుండు
తిండి కలిగినపుడు తినుట సున్న
తిరిపెమెత్తి శివుడు తిండి విలువ చెప్పె
దారి పూలతోట దార్ల మాట. 12

సాగి సాగి నదులు సాగరంబున జేరు
సాగరంబులన్ని సత్త్రి జేరు
చిత్రమదియ చూడ సృష్టి విధానంబు
దారి పూలతోట దార్ల మాట. 13

శ్రీనివాసుడిచట సిరులను కురిపించు
కాణిపాకమందు గణపతియును
పుణ్యఫలములిచ్చు పుడమి రాయలసీమ
దారి పూలతోట దార్ల మాట. 14

కావ్యహిమశిఖరము కాదన లేనిది
మనుచరిత్ర కథయు మనకు దొరికె
రామకథకు మొల్ల రామాయణంబురా!
దారి పూలతోట దార్ల మాట. 15

లేచివచ్చునేమొ లేపాక్షి బసవన్న
తరచి చూడ నద్భుతం బదెంత
వింతగొలుపునట్టి వ్రేలాడు శిల చూడు
దారి పూలతోట దార్ల మాట. 16

కరవు నేల కాదు కళలకు పుట్టిల్లు
వనరులుండె స్వర్ణ వజ్ర ఖనులు
రాగి సంగటి రుచి రాయలసీమదే!
దారి పూలతోట దార్ల మాట. 17

ఊటలూరు పోతులూరి తత్త్వజ్ఞాని,
రాజ్యమేలినట్టి రాయలుండె
రాళ్ళసీమ కాదు రతనాల సీమరా
దారి పూలతోట దార్ల మాట. 18

తండ్రి పేరునొకరు తల్లి పేరునొకరు
చెప్పుకొనుచు కీర్తి కప్పుకొనును
చెప్పెడిది యొకటగు చేయునింకొక్కటి
దారి పూలతోట దార్ల మాట. 19

గుప్తనిధులు, ఘనులు గుర్తించ గలిగిన
గుట్టు విప్పు యాప్పు గూగులమ్మ
మనసు విప్పి చెప్ప మనకది సాధ్యమా?
దారి పూలతోట దార్ల మాట. 20

నల్ల ధనము పోయి తెల్ల ధనము వచ్చె
వెయ్యి వద్దు రెండు వేలు ముద్దు
చిన్ననోటుకన్న మిన్న పెద్దదగున?
దారి పూలతోట దార్ల మాట. 21

నలిగిపోయె జనత నల్ల ధనము పేర
నోట్ల రద్దువలన కోట్లకొలది
చావు రాక బ్రతికి సన్న్యాసులయ్యేరు
దారి పూలతోట దార్ల మాట. 22

పట్టపగలు దోచి నిట్టనిలువు ముంచు
'విజయ మాల్య' 'మోడి' విజ్ఞులుండు
బ్యాంకు వైపు పోకు బెంగ యెక్కువగును
దారి పూలతోట దార్ల మాట. 23

ముందు తిండి పెట్టి మూతిని బిగియించు
జీతమున్న బేంకు గీత గీయు
పట్టుగలిగినట్టి పాలన చూడరా
దారి పూలతోట దార్ల మాట. 24

క్రొత్తనోట్ల వలన కోరి వచ్చుననిరి
నోట్లు రద్దు చేయ కోట్ల కొలది
నల్ల ధనము లేదు తెల్ల ధనము లేదు
దారి పూలతోట దార్ల మాట. 25

నిదుర లేచి మొదలు నిదురపోవు వరకు
మింగవలయు మాత్ర మిగలకుండ
బొజ్జనిండు నవియె భోజనమును మించు
దారి పూలతోట దార్ల మాట. 26

నరములన్ని నలిగి, నయనమ్ములన్నియు
కరములన్ని యడుగు శరణమనుచు
వరములిమ్మనరు షుగరు మాన్పమందురే
దారి పూలతోట దార్ల మాట. 27

అడగకుండనిత్తురందరు సలహాలు
శాస్త్రవేత్తలేరి శాశ్వతముగ
మట్టు బెట్టవారు మధుమేహ జాడ్యమున్
దారి పూలతోట దార్ల మాట. 28

మృత్యువనిన జీవి నిత్యము భయపడు
మనిషి యెన్నడైన మరణమొందు
ముందు తెలియనదియె పొందైన నరకంబు
దారి పూలతోట దార్ల మాట. 29

తినకముందు నొకటి తిన్నప్పుడొక్కటి
పొడుచుకొనవలయును జడుచు కొనకు
మనల జంపు సఖియె మధుమోహనాంగిరా
దారి పూలతోట దార్ల మాట. 30

కదులు మెదులు లేక కనపడకుండనే
కాటు వేయగలదు కార్పొరేటు!
కరుణ యనెడి మాట తరచి చూచిన లేదు
దారి పూలతోట దార్ల మాట. 31

సంతకంబు పెట్టు సర్జరీకనుచుండు
కథల కథల గుట్ట కార్పొరేటు
జబ్బుమాటకన్న డబ్బుదే మాటరా
దారి పూలతోట దార్ల మాట. 32

సెలవులెందుకనిన చెప్పలేమనకండి
పిల్లలున్న చాలు పిలిచునండి
కార్పొరేటు కళలు కనిపించి మురిపించు
దారి పూలతోట దార్ల మాట. 33

సందు వెతుకుకొనుచు సర్వరంగంబులు
వామనుండువోలె వచ్చునండి
కమ్మగాను చెప్పు కార్పొరేటు కథలు
దారి పూలతోట దార్ల మాట. 34

వరద వోలె మనము వదిలెడు జలమును
మంచి నీరు వోలె మరల మనకె
ఇచ్చునండి మార్చి ఇంకుడు గుంతలే
దారి పూలతోట దార్ల మాట. 35

ఇంటివద్దచూడు ఇల్లాలి ముచ్చట్లు
ఇంటిచుట్టు కట్టు ఇంకుగుంత
ఇంటి పొదుపు తెలుపు ఇంకుడు గుంతులే
దారి పూలతోట దార్ల మాట. 36

దాహమైనవారు దారంత వెదకుచు
వెతికి పట్టు బావి వెతలు తీర్చు
నీటివాలు నటుల నిలబెట్టి పట్టరా
దారి పూలతోట దార్ల మాట. 37

విప్పి యుంచకండి విచ్చలవిడిగాను
పళ్ళు తోమునపుడు పట్టనట్టు
ఎల్లవేళలందు నల్లాను బిగియించు
దారి పూలతోట దార్ల మాట. 38

గడ్డమెపుడుగీయ నడ్డదిడ్డంబుగా
వ్యర్థముగను నీళ్ళు వదులుచుంద్రు
కొద్దినీళ్ళె కోట్ల గొంతు తడిపె చూడు
దారి పూలతోట దార్ల మాట. 39

నీటి విలువ తెలుపు నీకు రాయలసీమ
కోరినంత యిచ్చు కోనసీమ
తెచ్చి పంచునెపు డదే భాగ్యనగరము
దారి పూలతోట దార్ల మాట. 40

విత్తనమును బట్టి వికసించు బుద్ధులు
మట్టి యొక్కటైన మాను వేరు?
మనుషులంత యొకటి మర్మంబు వేరయా
దారి పూలతోట దార్ల మాట. 41

కనులనుండి మెరుపు కౌగిలిచ్చు వలపు
మాయల జలతారు, మధురవాణి
నగరమందునున్న నటన యుండదెచట!
దారి పూలతోట దార్ల మాట. 42

ఫోను తెరవగానె పొంగి పొర్లుచు వచ్చు
నీతి బోధ చేయు గీతలెన్నొ
నిత్యసత్య మదియె నీతియనగనేల!
దారి పూలతోట దార్ల మాట. 43

మనకు తెలియకుండ మనపేరు ప్రచురించు
రచన చూడ ముఖము రంగు మారు
వివరములను చూచి విస్తుపోకుందుమా?
దారి పూలతోట దార్ల మాట. 44

కులము, మతములన్ని కుత్సితబుద్ధులు
కలపవలయు గాని కలహమేల?
మంచి కన్న మించు మానవత్వము లేదు
దారి పూలతోట దార్ల మాట. 45

యోగి యయ్యెనొకడు భోగ విముఖుడయ్యె
నొకడు, తాత్త్వికుండు నొక్కడయ్యె
జడకు చిక్కినతని జన్మెంత మోక్షమో
దారి పూలతోట దార్ల మాట. 46

అవసరంబు మేర యన్యభాషనయిన
మాటలాడవలయు మరువవద్దు
మాతృభాషయేను మనకు జీవనమగు
దారి పూలతోట దార్ల మాట. 47

ఊరికంతటికిని పేరేమొ పెద్దమ్మ
కల్మషమునెరుగని కరుణశీలి
నన్ను కన్నతల్లి నాగమ్మ పేరురా
దారి పూలతోట దార్ల మాట. 48

పేరు పెట్టుమనియు పెండ్లిపెద్ద వనియు
పిలుచుకెళ్ళువారు తలచువారు
అమ్మనెపుడు కొలుచు అమ్మవారందురే
దారి పూలతోట దార్ల మాట. 49

కలిమి లేములన్ని కష్టసుఖములట్లు
తల్లి దండ్రి యన్న దమ్ములుండ్రు
రక్తబంధ మదియె రాదేదియును సాటి
దారి పూలతోట దార్ల మాట. 50

కదనరంగమేల కత్తి దూయుట యేల
పద్యమైన కవిత గద్యమైన
సరసమగుట వలయు సకియ కౌగిలివోలె
దారి పూలతోట దార్ల మాట. 51

పొమ్మనుచును కొట్టు పొయ్యి వీడదు కుక్క
పోయి చూడు మరల పొయ్యినుండు
చెప్పు తినెడి కుక్క చెవికేల తాకురా
దారి పూలతోట దార్ల మాట. 52

రాజకీయవేత్త రానున్నవేళకి
పాఠశాలనున్న బాలలేల?
తేరగొచ్చునేని తెమ్మందురెల్లరన్
దారి పూలతోట దార్ల మాట. 53

ప్రక్కనున్నవారి పలుకుల కన్నను
ప్రొద్దుపోక చేయు ఫోను ముద్దు
దగ్గరున్ననేమి దౌర్భాగ్యమిద్దిరా?
దారి పూలతోట దార్ల మాట. 54

అక్షర సుమమాల నందించి ప్రేమతో
సంతసమున నన్ను సత్కరించె
గుండెనుందువయ్య! గురవయ్య! కవివర్య!
దారి పూలతోట దార్ల మాట. 55

శిలను చెక్కి శిల్పి శిల్పముగ మలుచు
కఠినహృదయమైన కరుగునట్లు
సహృదయతను నింపు సాహిత్య పఠనంబు
దారి పూలతోట దార్ల మాట. 56

సర్వవేళలందు సాహితీ పఠనంబు
మలినమవ్వువేళ మనసునంత
సంస్కరించి మనకు సమదర్శనమునిచ్చు
దారి పూలతోట దార్ల మాట. 57

ప్రాస, యతులు జతలు పట్టించుకున్నను
గణము కన్న నిలుచు గుణము మిన్న
రసహృదయుని కదియె రమణీయ పద్యంబు
దారి పూలతోట దార్ల మాట. 58

మనసు మెచ్చుకున్న మనవారిదైనను
పొగడమన్న మనము పొడగలేము
మంచిరచనయైన మరిచిపోలేమయా
దారి పూలతోట దార్ల మాట. 59

కలిమిలేములన్ని కావడికుండలు
ఒడిదుడుకులు తెలిపి ఓర్పునిచ్చి
సత్త్వ గుణము నేర్పు సాహిత్య పఠనంబు
దారి పూలతోట దార్ల మాట. 60

విద్యనిచ్చు నాత్మవిశ్వాస మొకనాడు
కార్పొరేటు విద్య కలలు త్రుంచె
విద్య పేరు చెప్పి విసుగెంత పెట్టురా
దారి పూలతోట దార్ల మాట. 61

మనసు శాంతిగున్న మధురంబు భాషయు
కోపమున్నవేళ 'క్రొత్త' భాష
భావనెట్టిదైన భాష యటులె యుండు!
దారి పూలతోట దార్ల మాట. 62

సూటు వేయునతడు చుట్టు కావలినుండు
ముందు నడచినంత ముఖ్యుడవడు
మెరుగు కన్న విలువ మేధావి కుండురా
దారి పూలతోట దార్ల మాట. 63

వెతుకు వెతుకు వెతుకు బ్రతుకంతయు వెతుకు
వెంట బడుచు వెతుకు వెలుగు కొరకు
వెతుకు యుగ యుగముల వెలుగుబాట వెతుకు
దారి పూలతోట దార్ల మాట. 64

దళితుడెంత యున్నతపదవి నుండిన
కులము కర్మ యనుచు కూర్మి లేదు
భరతభూమినందు భాగ్యంబు చూడరా!
దారి పూలతోట దార్ల మాట. 65

అమ్మ నాన్నలనిన ఆదరింతుము గాని
అన్నిదక్కినంత నవతలుంచు
విత్తు బట్టి మొలుచు విలువైన మొక్కలు
దారి పూలతోట దార్ల మాట. 66

పాండితీ ప్రకర్ష ప్రకటించుకొనుటకు
అర్థమవగనీక యరచుచుండు
ఆధిపత్యభావ మవివేకి కుండురా
దారి పూలతోట దార్ల మాట. 67

'చారు' నెవ్వరయ్య మరి'చారు' రుచి చూడ?
విడువరెవరు 'చారు' విస్తరున్న
మనసు నున్న 'చారు'మతివోలె తలి'చారు'!
దారి పూలతోట దార్ల మాట. 68

వేసవి సెలవులకు వెళ్ళితి నూరికి
ఉక్కబోసి చంపె ఊరునందు
అన్ని మరచిపోతి అమ్మను చూడగా
దారి పూలతోట దార్ల మాట. 69

కలవకుండ నెంత కాలముంచగలవు
మాల మాదిగలను మాయచేసి
వలదు రెచ్చగొట్టు వర్గీకరణ నేడు
దారి పూలతోట దార్ల మాట. 70

నమ్ముకున్న నేల నమ్మగా భావించు
పేదవాళ్ళ యిళ్ళు 'పెద్ద' వాళ్ళు
మాటలాడకుండ మాయమొనర్తురు!
దారి పూలతోట దార్ల మాట. 71

తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చె
మారవలయు ముందు మనిషి మనసు
దేశమేదియైన దేవళంబౌనురా
దారి పూలతోట దార్ల మాట. 72

మారుతున్న కాల పరిణామ గతులన్ని
కనుట లేదు కవులు వినుట లేదు
తుడిచివేసినట్టి 'తురక' లనుట యేల?
దారి పూలతోట దార్ల మాట. 73

చలనశీల కవులు 'చండాల' మనుటేల
ఆధిపత్యమున్న నట్లె పిలుచు
మనసు పొడుచునట్లు మాట పలుకుటేల
దారి పూలతోట దార్ల మాట. 74

అందనంత యెత్తు నాకాశముండెనా
ఉండి యుండనట్లు నుండగలదు
మనిషి కీర్తి యటులు మాయలు చేయునే
దారి పూలతోట దార్ల మాట. 75

ఎటుల వచ్చి వీచు నెటుల పోయిన గాని
వాయువున్న మనకు హాయి కలుగు
కనపడియు కనపడకను ప్రాణములు నిల్పు
దారి పూలతోట దార్ల మాట. 76

ఏరులన్ని పారి యెచ్చట కలియును?
సాగరమున చేరి శాంతినొందు
మానవుండు మరల మట్టినటులె చేరు
దారి పూలతోట దార్ల మాట. 77

ఘర్షణమున పుట్టు ఘర్షణమున పోవు
అగ్నిగుణముకున్న అంతమదియె
ఘర్షణంబు జన్మ ఘర్షణే మరణంబు
దారి పూలతోట దార్ల మాట. 78

స్పర్శ, రూప, రసము, శబ్ద గంధాలను
విషయములని పిలుచు విశ్వమెల్ల
పదమటునిటు గాని పరమాత్మ రూపమే!
దారి పూలతోట దార్ల మాట. 79

తప్పు చేయువాడు తప్పుకొనుచునుండు
కాంతిహీనమౌను కనులు కనుము
నీతికలిగెనేని నీవైపె చూడడా?
దారి పూలతోట దార్ల మాట. 80

అన్ని మార్చగలుగు నధికారమున్నచో
ముందునున్నవన్ని మూలకేసి
తనదు ముద్ర వేయ తంతు జరుగునంతె!
దారి పూలతోట దార్ల మాట. 81

ఉన్నవాటి విలువ ఉన్నప్పుడెరుగము
తిండి లేని నాడు తిండి విలువ
అరగనపుడు తెలియు నారోగ్యము విలువ
దారి పూలతోట దార్ల మాట. 82

సీరియళ్ళు చూడు చిత్రవిచిత్రము
మూసపోసినట్లు మూల్గుచుండు
అతికి వదలకుండు అతివల కండ్లురా
దారి పూలతోట దార్ల మాట. 83

విశ్వరూపుడనని వివరించు కవి గారు
ఆత్మగౌరవమని అరుచుచుండు
కవితలందు తప్ప కనము జీవనమున
దారి పూలతోట దార్ల మాట. 84

భావజాలమనుచు వాదులాడుట యేల
ఆచరించునపుడు అదియె విలువ
మంచి రచన విలువ మానవత్వంబురా
దారి పూలతోట దార్ల మాట. 85

చదువుకైనగాని చంటిబిడ్డలనుచు
వసతిగృహమునందు వదలు వేళ
కరుణ హృదయులంత కదలి పోకుందురా
దారి పూలతోట దార్ల మాట. 86

ఏది శాశ్వతమగు నేదశాశ్వతమగు?
నిన్ననేటికేది? మొన్న యేది?
తల్లిదండ్రులన్నదమ్ములంతయు భ్రమ
దారి పూలతోట దార్ల మాట. 87

ఏల వచ్చినావు? ఎందుకు పోవలె?
మమతలేల? మరల మరణమేల?
నీటిబుడగవోలె నిత్యమ్ము మునకేల?
దారి పూలతోట దార్ల మాట. 88

వ్యాకరణములేని వాఙ్మయాధ్యయనము
పథ్యమేలననిన వైద్యు మందు
పగిలినట్టి పడవ పట్టిన ఫలమేమి?
దారి పూలతోట దార్ల మాట. 89

వినెడివాని యెదుట విన్నవి కన్నవి
కలిపి చెప్పవచ్చు కథలు కథలు
నిజము తెలియునెపుడు నిలకడమీదనే
దారి పూలతోట దార్ల మాట. 90

నీట మునిగినట్టి నీటిగడ్డను చూడు
తరచి చూడకుండ తగినదనకు
మనసు మర్మమెపుడు మనకట్లునుండురా!
దారి పూలతోట దార్ల మాట. 91

నోట వచ్చినటుల మాటలాడ తగదు
మాటకున్న విలువ మరువరాదు
మరచువానినెవడు మన్నన సేయును?
దారి పూలతోట దార్ల మాట. 92

ఎక్కడుంటిమయ్య యేమి బ్రతుకులయ్య!
యెఱుకలోళ్ళటంచు నెట్లు తిట్టు?
జాతినట్లు తిట్ట జాగృతియే లేదు
దారి పూలతోట దార్ల మాట. 93

ఎక్కడైన గాని చక్కగా దేవుళ్ళు
కొండలెక్కియేల కొలువు దీరు?
అందరంతరంగమవలోకమగుటకే
దారి పూలతోట దార్ల మాట. 94

పట్టుకొనుట యెట్లు పరమాత్మ గమనంబు
గాజుమేడ వోలె కదిలి కదిలి
తనువువీడగానె దైవమై వెలుగురా
దారి పూలతోట దార్ల మాట. 95

బిగ్గుబాసు నేడు బిగికౌగిలిల గూడు
సిగ్గు నెగ్గు లేవు చిన్నబోవ
నెంత రెచ్చిపోయి నంత రేటింగురా
దారి పూలతోట దార్ల మాట. 96

అంతుపంతు లేని ఆశ్చర్య కథనాలు
వెతుకవద్దు 'నెట్టు' (Net) వెగటు పుట్టు
నేతిబీరకాయ నెయ్యినిచ్చునటయ్య!
దారి పూలతోట దార్ల మాట. 97

చిరుత బోలునట్టి పరుగుపెట్టు నడక
చీమ చావనట్టి చిన్ని నడక
నడక నడక చూడ నలుబది తీర్లయా
దారి పూలతోట దార్ల మాట. 98

మనసు తేలిపోయె మబ్బు కదిలినట్లు
కనులు తడిపి పోయె చినుకులగుచు
బాధ తీరిపోయె బరువేలనుండురా!
దారి పూలతోట దార్ల మాట. 99

అమ్మ మాటవోలె నమృతంబు కురిపించు
కవన మధురిమలకు గగన గంగ
తెలుగు భాష భువిని దిక్కులన్ని నిలుపు
దారి పూలతోట దార్ల మాట. 100

అక్క చెల్లి తమ్ము దన్నదమ్ములతోను
అమ్మ కరుణనున్న నాన్న కళకు
మమతల్లుకున్న మంచి యిల్లగునురా
దారి పూలతోట దార్ల మాట. 101

ప్రాణమెట్లుపోవు పట్టుకొనగలమా
ఊరకేల చింత ఉనికి కొరకు
వానచినుకు బోలు మానవజన్మరా
దారి పూలతోట దార్ల మాట. 102

నాది నాది యనిన నవ్వుకొనును మట్టి
మట్టి పట్టి నోట బెట్టరెవరు
మట్టి యందె మనిషి గిట్టకపోవునా?
దారి పూలతోట దార్ల మాట. 103

కాదు కాదు నీది కావ్యంబు కాదురా
కావు కావు నువ్వు కవివి కావు
కాకి గ్రుడ్డు కాకి కాక కోకిల యౌనె
దారి పూలతోట దార్ల మాట. 104

ముక్కలన్ని కలిపి ముడివేసినట్లుగా
గాలిపటమువోలె బ్రతుకుసాగ
యెంతకాల మెగురు నేమి తెలుసునయ్య!
దారి పూలతోట దార్ల మాట. 105

దూరమైనగాని భారమైననుగాని
ఎక్కడున్నను మన మొక్కటయ్యె
మంత్రము వలె దృశ్యయంత్ర మున్ననుచాలు!
దారి పూలతోట దార్ల మాట. 106

సెలవుదినములందు వలస వచ్చిన రీతి
బుల్లితెరల మీద బుద్ధిగాను
తెల్లబోయి చూడు దెయ్యములుండురా
దారి పూలతోట దార్ల మాట. 107

వేంకటేశ్వరునికి వేడుకలెన్నియో
నిత్యశుభములగుచు నిలిచెనంట
తలచుకున్న యపుడె తనకు కళ్యాణంబు
దారి పూలతోట దార్ల మాట. 108

వేడివేడిగాను వేగిరమే తింటి
పొయ్యిమీద వండు పొంగడంబు
మరచిపోని వంట మంజుయే చేయురా
దారి పూలతోట దార్ల మాట. 109

సాగరంబువోలె సాగె నీ యేడాది
ఆడుకొనుచునంత పాడుకొనుచు
ఇంతకన్న నాకు సంతసంబేదయా
దారి పూలతోట దార్ల మాట. 110

పెద్దవారినైన పెదవి కదపకుండ
కంటిచూపు విసిరి కదలు మనును
పట్టివిడుచు శక్తి పసివాళ్ళకుండురా
దారి పూలతోట దార్ల మాట. 111

మాతృభాష యన్న మాకిపుడది బూతు
యెంగిలాంగ్లమన్న నెంత హాయి
ఊరకనుటకైన నుండవలె కదరా
దారి పూలతోట దార్లమాట. 112

పండితుండునైన పాలకులైనను
ప్రజలభాష యేల పట్టకుండు?
ఆజ్ఞలెల్ల నట్లె అవని నెగురుచుండు!
దారి పూలతోట దార్ల మాట. 113

రాజు శక్తి నెరిగి రాణి యణిగి యుండు
వృద్ధుడైన చెలగి విర్రవీగు
పగలణంగి రాత్రి పైచేయి యగునట్లు,
దారి పూలతోట దార్లమాట. 114

ఎచటనున్న నిత్యమచట పరిమళించు
ఎచటనున్న సత్య మచటనుండు
మంచి పుష్పమువలె మహనీయుడుండురా
దారి పూలతోట దార్ల మాట. 115

కాలమెంత మారె కాలు కదపనేల
గూగులమ్మ నడుగు గూడు కూడు
వడిగ వచ్చు గొబ్బి పిడకలైనను నేడు
దారి పూలతోట దార్ల మాట. 116

ఇంటిముందునుంచుమిష్టమౌ రీతిగా
గోవుపేడయైన గొబ్బియమ్మ
లిపుడు కొనగ వలయు లెమ్ము సహోదరీ
దారి పూలతోట దార్లమాట. 117

సాధుశబ్దమైన సంస్కృతమైనను
ప్రజలకర్థమైన భాష యైన
ప్రజలు పారిపోరు పద్యము చూడగన్
దారి పూలతోట దార్ల మాట. 118

వర్ధమాన కవులు వరదలా వ్రాసినా
దినముకొక్క కవిత దినము దినము
ముదము కలుగునట్లు ముద్రించును 'గణేశు'
దారి పూలతోట దార్ల మాట. 119

మంచినీటి వోలె మనకాంగ్లభాషయ్యె
తేనె వంటిదాయె తెలుగు భాష
నిత్యమవసరంబు నీళ్ళాయెను కదరా
దారి పూలతోట దార్ల మాట. 120

పోతపోసినటుల పొందికగానుండు
సీసపద్యపు గతి స్వీయ వోలె (స్వీయ - కావ్యనాయిక)
పద్యసుందరిట్లు పట్టుబడు కవికే
దారి పూలతోట దార్ల మాట. 121

భావవీణ నేటి పరిశోధకులకున్న
వెలుగు నిచ్చు దివ్వె తెలుగు నందు
భువనవిజయము వలె 'బూసి' పోషించురా
దారి పూలతోట దార్ల మాట. 122

ఫోర్డు కారు మీద పోయినప్పటికిని
మంచి భోజనంబు మనిషికేది?
సొమ్ములున్నగాని సొంతమా సౌఖ్యంబు?
దారి పూలతోట దార్ల మాట. 123

కన్నడంబువాడు కస్తూరి జల్లుచు
'దేశభాషలందు తెలుగు లెస్స'
అనిన తెలుగువాని కదియేను హర్షంబు!
దారి పూలతోట దార్ల మాట. 124

పట్టెమంచమున్న పడుకొనలేమాయె
నడుమునొప్పులన్ని నాట్యమాడు
జీతమున్నగాని జీవితంబేదయా!
దారి పూలతోట దార్ల మాట!. 125

నిదురపోకుమన్న నిదురవచ్చునెపుడు
నిదురపోదమన్న నిదుర రాదు
తిండి, నిదుర రెండు తింగరిబుచ్చులే!
దారి పూలతోట దార్ల మాట. 126

షుగరు కలిగినేని సుష్టుగా తినలేవు
తినగలిగిన వేళ తిండి కరువు
కడుపు మాడుతున్న కనులుమూత పడునా!
దారి పూలతోట దార్ల మాట. 127

ఏవి శాశ్వతంబు లేవి నిత్యమ్మొందు
నెవరు శాశ్వతంబు నిలుచు నెవరు
ఊపిరున్న వరకు నుండు సంతసమున
దారి పూలతోట దార్ల మాట. 128

కనులు రెండు గాని కనెడి చూపొక్కటే
చేతులేమొ రెండు చేయు నొక్క
పనిని రైలు వోలె బాటకోలక్ష్యంబు
దారి పూలతోట దార్ల మాట. 129

స్టేటు బేంకు బుడ్డి వేస్తు బుడ్డగునట
డబ్బులున్న యెడల ధర్మహుండి
దోచుకొనుట కొరకు దొడ్డ యాప్పుండురా!
దారి పూలతోట దార్ల మాట. 130

మార్పు రాని మనిషి మనచుట్టు చేరుచు
చనువు దొరికెననుచు చంకనెక్కి
విర్రవీగునపుడు విడిచిన చాలయా
దారి పూలతోట దార్ల మాట. 131

భక్తకోటిపూజ భక్తులకన్నను
వర్తకులకు కలిసివచ్చెనండి
పుణ్యమేమొ గాని పూజారిమెచ్చడా?
దారి పూలతోట దార్ల మాట. 132

కల్మషంబు లేని కరుణ హృదయమున్న
మంచి పరిమళించు మనుషులైన
భోగభాగ్యమిచ్చు భోగిపండుగ మీకు
దారి పూలతోట దార్ల మాట. 133

రోగియొకటి చెప్ప రోగము వేరను
వైద్యులుండనసలు వైద్యమెట్లు
కొంతమేలనుకొను సొంత వైద్యంబునే
దారి పూలతోట దార్ల మాట. 134

తెలుగు పద్యమునకు దీపమ్ము నన్నయ
నటన యందు మేటి నందమూరి
విప్లవాల జ్యోతి వెలిగించె నల్లూరి!
దారి పూలతోట దార్ల మాట. 135

పలకరించునపుడు పరిమళించునతడు
ఎదిగినకొలదియును ఒదుగునతడు
నాకు నీకు కంటి నలుసు కాదతడురా!
దారి పూలతోట దార్ల మాట. 136

భరతజాతినంత పరిమార్చు జాడ్యంబు
నరనరాన నిండి నాట్యమాడ
కూల్చి కాల్చవోయి కులమను వృక్షంబు
దారి పూలతోట దార్ల మాట. 137

స్త్రీని దేవత యని చెప్పిరి నీతులు
బడికి గుడికి వలదు పడతి యనిన
ఆమె లేని సృష్టి కర్థంబు లేదురా
దారి పూలతోట దార్ల మాట. 138

మురుగు కాల్వలందు మునిగెడిదైనను
మూతి తెరవకున్న ముద్దుగుండు
కాపు కాచి చూడు కంపేదొ తెలియురా
దారి పూలతోట దార్ల మాట. 139

మంత్రములు చదివిన మంచి పంటలు పండు
అనెడి వెఱ్ఱి చూసి హర్షమేల
శాస్త్ర విద్య నేడు శాస్త్రి విద్యాయెనా?
దారి పూలతోట దార్ల మాట. 140
(ఒక విశ్వవిద్యాయ వైస్ ఛాన్సర్ గారి ప్రకటన చూసి...)

చుట్టు తిప్పుకొనుచు చూడమనుచునుండు
పిచ్చి పిచ్చివన్ని తెచ్చి పిచ్చి
పట్టినట్లు చేయు పాపి మొబైలురా
దారి పూలతోట దార్ల మాట. 141

ఫేసుబుక్కు తీసి పెంటలో విసిరినా
ఫోను తెరిచి చూడ పొర్లి వచ్చు
వదలనట్టి జిడ్డు వాట్సప్పు మనకుండె
దారి పూలతోట దార్ల మాట. 142

మంచిపనులు చేయ మార్గంబులన్నియు
మూర్ఖులంత కలిసి మూసివేయ
వెలుగురేఖలవలె తెరుచునోమార్గంబు
దారి పూలతోట దార్ల మాట. 143

నలుగురన్నలకును వెలుగునిచ్చినచెల్లి
పెద్దదైనగాని ముద్దు మాకు
'పాప' యగును 'విజయ' పసిపాప యెప్పుడు!
దారి పూలతోట దార్ల మాట. 144

జరుగు జరగకున్న సర్వజనులు మెచ్చ
రిష్టమున్న నీకు కష్టమైన
సంప్రదాయమనిన సరదాల సెలయేరు
దారి పూలతోట దార్ల మాట. 145

వేడిగున్నయెడల వెంటనే కాలును
ఆరిపోయినప్పు డంటుకొనును
బొగ్గునంటినట్లె పోకిరిస్నేహంబు!
దారి పూలతోట దార్ల మాట. 146

పిచ్చివాడు మనకు పెన్నిదై పాలింప
తుగ్లకుపనులన్ని తోచుచుండ
ఓటువేసినప్పుడొకవంకగమనించు
దారి పూలతోట దార్ల మాట. 147

చదువుకన్నమిన్న సంస్కారమున్నచో
చక్కగున్న యెడల చదువు లేల?
నోరుమంచిగున్న ఊరుకేముందిరా !
దారి పూలతోట దార్ల మాట. 148

నీదు పలకరింపు నీదు వెచ్చదనము
లేనిదేది సుఖము కాదు కాదు
సాటి యేది నాకు సహచరి కన్నను!
దారి పూలతోట దార్ల మాట. 149

విత్తనమ్ము పగిలి విశ్వరూపమునొందు
మంచినీటినిచ్చు మబ్బు కరిగి
అరుణకిరణమగుచు నస్తమించవలెరా
దారి పూలతోట దార్ల మాట. 150

చిన్ననాటిదైన చీముడు ముక్కును
చిన్ననాటిదైన సిగ్గుబిళ్ళ
చిత్రమందునున్న చిన్నతనమగునా?
దారి పూలతోట దార్ల మాట. 151

మనము పగల గొట్ట మరణంబు సిద్ధించు
తనకదే పగిలిన జననమిచ్చు
గుడ్డు బోలు మనసు గుట్టెరిగి మసలు!
దారి పూలతోట దార్ల మాట. 152

మరల మరల నేను మరణింతు జనియింతు
మంచి జరుగనెంచి మరణమొంది
దేశరక్షణమున దేహంబు నిచ్చెద!
దారి పూలతోట దార్ల మాట. 153

మాతృభాష కొరకు మరణించి వీరులు
మాతృభాష మహిమ మనకు తెలిపె
మాతృభాష నెపుడు మరువకు సోదరా!
దారి పూలతోట దార్ల మాట. 154

తెలుగు శాఖలోన తెలివైన మార్గంబు
పాఠ్యభాగమొకటి పఠనమొకటి
పనికివచ్చు చదువు పాఠంబులాయెరా
దారి పూలతోట దార్ల మాట. 155

సర్వమతడటంచు గర్వము లేనిదై
ప్రియుని మనము గెలిచి ప్రియుని తలపు
సర్వమామె యగుటె స్వాధీన భర్తృక
దారి పూలతోట దార్ల మాట. 156

సాహసమున చెప్పె సాధించుటెటులనో
రంగుకున్న శక్తి రంగరించి
నలుపు యెరుపు కలిసి నడవమనియెనోయి!
దారి పూలతోట దార్ల మాట. 157

ఉత్తములకు కోపముండునొక క్షణము
మధ్యమాధములకు మాత్రముండు
ఘడియ, దినము పాపి కది మరణాంతంబు!
దారి పూలతోట దార్ల మాట. 158

కవితపద్యమైన కమనీయభావంబు
వస్తువేది యన్న వాస్తవమ్ము
జాతి మేలుకొలుపు జాషువా కవనంబు
దారి పూలతోట దార్ల మాట. 159

అమ్మ మనలనెంత ఆదరించిన గాని
అందుకొంతనైన అందజేయు
తనయులెంతమంది ధర్మంబు పాటింత్రు?
దారి పూలతోట దార్ల మాట. 160

తల్లిదండ్రు లన్నదమ్ములైనను గాని
మనసు విరుగునటుల మాటలాడ
విషము త్రాగు నటుల విలవిలలాడమా?
దారి పూలతోట దార్ల మాట. 161

కాల్పనికత నింపి కళలు మంటను గల్పి
చలనచిత్రమగుచు చరిత యనిన
కళకు జీవకళను 'కాలా'కు దక్కెరా!
దారి పూలతోట దార్ల మాట. 162
(రజనీకాంత్ చలనచిత్రం 'కాలా')

పారవశ్యమైతి 'పారంజితా' నీకు
నీదు సాహసంబు నీదు రణము
తలచుకొందురయ్య దళితులందరు నిన్ను!
దారి పూలతోట దార్ల మాట. 163
('కాలా' చిత్ర దర్శకుడు పా.రంజిత్)

అందనంత దూరమక్షరమున్నను
దీక్షపూని మరొక దీపమయ్యె
సత్యకథనశీలి సావిత్రి బాయిరా
దారి పూలతోట దార్ల మాట. 164

రంగురంగులేవొ రంగరించుకొనుచు
లేతమొగ్గలిపుడె లేచి వచ్చి
శుభమనుచును చెప్పె సుప్రభాతమిదియె
దారి పూలతోట దార్ల మాట. 165

మా తండ్రి గారు

శ్రీ దార్ల అబ్బాయి (అనే) లంకయ్య గారు



సీ. ఆశ్రయించినవారి నాదరించె నతడు
కల్మషం బెరుగని కరుణమూర్తి
తగువులు పడకుండ దారినుంచె నతడు
ధర్మదేవతవంటి ధర్మమూర్తి
ఆత్మ గౌరవమన్న నాతడే చూపించె
అంబేద్కరుని కాత డానుయాయి
ఎల్ల గ్రామమును జాగృత పరిచె నతడు
తనకంద రొకటను ధన్యశీలి

తే.గీ. గ్రామ పెద్దగానున్న నిగర్వి యతడు
సంఘసంస్కరణకు తొలి సమరశీలి
అగ్రహార ప్రజలకయ్యె నాప్తు డతడు
అతడె దార్ల అబ్బాయియే ధరణినందు!



‘దార్ల మాట’ శతకం

డా॥ దార్ల వెంకటేశ్వర రావు

పద భావ సమన్వయంబుల
నెద మీటెడి యాటవెలఁదు లిచ్చోఁ గంటిన్
ముదమిచ్చు ‘దార్ల మాట’ల
కిదె మెచ్చితి దార్ల వెంకటేశ్వరరావున్.

- కంది శంకరయ్య

‘శంకరాభరణం’ బ్లాగు, వాట్సప్ సమూహ నిర్వాహకులు

సమకాలీన సమాజంలో కనిపిస్తున్న వివిధాంశాలను సరళమైన పదాలతో పద్యాల్లో శతకగుచ్ఛంగా సాహిత్య లోకానికి అందిస్తున్నందుకు దార్లను మనసారా అభినందిస్తున్నాను. ఈ శతకంలోని పద్యాలు అర్థవంతంగా ఉన్నాయనిపించింది. తనకు అనుభవంలోకి వచ్చిన అనేకాంశాలపైనా, తాను సమాజంలో గమనించిన వివిధాంశాలపైనా స్పందించి, చిన్న చిన్న పద్యాలుగా అందించాడు. ఇలా ఎన్నో అంశాలపై పద్యాలు రాసి మనకు శతకంగా అందిస్తున్న దార్లకు నా అభినందనలు.

- ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి

డీన్, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్, యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్

ఆత్మీయ మిత్రులు దార్ల వెంకటేశ్వరరావు గారు వచన కవిత్వంతో ప్రారంభించి, పలు విమర్శగ్రంథాల వరకు అనేక రచనలు చేశాడు. సమకాలీన విమర్శరచనలో తనదైన వాదంతో సాహితీప్రియుల అభిమానాన్ని పొందారు. ఇప్పుడు పద్య రచనతో తన ప్రతిభను చాటుకుంటున్నందుకు ఆనందంగా ఉంది.

- ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు

తెలుగుశాఖ, యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్

దార్ల అంటే ఒక గొప్ప కవి. ఒక మంచి విమర్శకుడు, లోతైన విశ్లేషణలు చేయగలిగిన విశ్లేషకుడు. విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తూ వారిని నిరంతరం చైతన్య పరుస్తూ వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడం అనేవి వీరి సహజ గుణాలుగా చెప్పవచ్చు. చదువుకున్న చోటనే బోధన చేసే అవకాశాన్ని పొందడం తన అదృష్టమైతే, చదువుకున్న గురువు చేత ప్రశంసింపబడడం వారి ప్రజ్ఞకు నిదర్శనం.

- ఆచార్య విస్తాలి శంకరరావు

తెలుగు శాఖ అధ్యక్షుడు, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై

ISBN 978-81-908963-8-2

9 788190 896382

మంజుశ్రీ ప్రచురణలు, హైదరాబాదు